


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 22-10-2019 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 37 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# పోలీసు అమరవీరులకు సెల్యూట్

- రాష్ట్ర భద్రత కోసం ప్రాణాలర్పిస్తారు
- వీర జవానులకు అశృతాంజలి
- పోలీసు వ్యవస్థపై గౌరవం పెరగాలి
- పోలీస్ టోపీ మీద ఉన్న సింహాలు దేశ సార్వభౌమాధికారానికి నిదర్శనం
- అవినీతి, రౌడీయిజంపై యుద్ధం చేయాలి
- మెరుగైన సమాజానికి కృషి చేయండి
- సీఎం జగన్ మోహన్ రెడ్డి





విజయవాడ : పేదవారు సైతం వివక్షకు గురికాకుండా తమకు న్యాయం జరిగిందని చిరునవ్వుతో ఇంటికి వెళ్లగలిగినపుడే పోలీసు వ్యవస్థ మీద గౌరవం మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు సెల్యూట్ చేస్తున్నా అని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన సంస్మరణ సభలో సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించి... అమరులు వారు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణకై చైనా సైన్యం దాడిలో వీరోచితంగా పోరాడుతూ వీరమరణం పొందిన పోలీసు అధికారి కరణ్‌సింగ్ సహా పదిమంది సీఆర్పీఎఫ్ సిబ్బంది త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. అలాంటి అమరవీరులు అందరికీ ఈ సందర్భంగా సెల్యూట్ చేస్తున్నా అన్నారు. ఇక మెరుగైన పోలీసు వ్యవస్థ కోసం ప్రతీ పోలీసు సోదరసోదరీమణులు నిరంతరం కృషి చేయాలని సీఎం జగన్ పేర్కొన్నారు. పోలీస్ టోపీ మీద ఉన్న సింహాలు దేశ సార్వభౌమాధికారానికి నిదర్శనం. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎంతటివారికైనా మినహాయింపు ఉండకూడదు. తరువాయి 2లో..




## ఏపీలో జిల్లాలకు కొత్త ఇంచార్జ్ మంత్రులు

అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనా పరంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు ఇప్పటివరకూ జిల్లా ఇంచార్జ్‌లుగా పనిచేస్తున్న మంత్రులకు కొందరికి స్థాన చలనం కల్పించగా, మరికొందరికి కొత్తగా అవకాశం కల్పించారు.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి వ్యవహారాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం ఆయా జిల్లాల వారీగా ఇంచార్జ్ మంత్రులను నియమించింది. 13 జిల్లాలకు 13 మంది మంత్రులను ఇంచార్జ్‌లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాల వారీగా ఇంచార్జ్ మంత్రుల వివరాలుః

శ్రీకాకుళం - కొడాలి నాని, విజయనగరం - వెల్లంపల్లి శ్రీనివాసరావు, విశాఖపట్నం - కురసాల కన్నబాబు, తూర్పుగోదావరి - మోపిదేవి వెంకటరమణ, పశ్చిమగోదావరి -పేర్ని వెంకట రామయ్య, కృష్ణా - పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, గుంటూరు - చెరుకువాడ రంగనాథరాజు, ప్రకాశం - బుగ్గన రాజేంద్రనాథ్ తరువాయి 2లో..

## నవంబర్ 3న ఇసుక కార్మికుల ర్యాలీ

- మళ్లీ రంగంలోకి జనసేన!
- భవన నిర్మాణ కార్మికులకు పవన్ మద్దతు

మంగళగిరిః జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో విశాఖలో భారీ ర్యాలీ నిర్వహించబోతున్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు మద్దతుగా ఈ ర్యాలీని చేపట్టనున్నారు.

పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ విశాఖపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఇసుక కొరత వల్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ అంశాన్ని హైలెట్ చేయడం కోసం నవంబర్ 3న ర్యాలీ నిర్వహించాలని జనసేన నిర్ణయించింది. రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఉపాధి లభించకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు.. వారికి మద్దతుగా పవన్ కళ్యాణ్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారని జనసేన పార్టీ తెలిపింది.

భవన నిర్మాణ కార్మికులకు మద్దతుగా నవంబర్ 3న మధ్యాహ్నం 3 గంటలకు పవన్ కళ్యాణ్ ర్యాలీని ప్రారంభిస్తారు. ర్యాలీ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు అనేది స్థానికులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని జనసేన తెలిపింది. మంగళగిరిలో జనసేన రాష్ట్ర కార్యాలయంలో రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలు చర్చించారు.

## హోంగార్డులకు రూ.40 లక్షల బీమా



అమరావతి: హోంగార్డులకు బీమా సౌకర్యం కల్పించేందుకు యాక్సిస్ బ్యాంక్ ముందుకు రావడం చాలా సంతోషకరమని ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 15వేల మంది హోంగార్డులు, 72వేల మంది పోలీసులకు బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రమాదంలో మరణించిన హోంగార్డులకు రూ.40 లక్షల బీమా వర్తిస్తుందని వెల్లడించారు. పూర్తిగా అంగ వైకల్యం కలిగితే రూ.30 లక్షలు బీమా వర్తిస్తుందని చెప్పారు. పోలీసుల ఆరోగ్య భద్రతలో హోంగార్డులను కూడా భాగస్వాములను చేసేందుకు ఆలోచన చేస్తామని డీజీపీ తెలిపారు.

## టీడీపీకి షాక్..

## బీజేపీలో చేరిన మాజీ మంత్రి ఆది నారాయణ రెడ్డి



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు, ముఖ్య, కీలకనేతలు ఆ పార్టీకి టాటా చెప్పేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. తాజాగా.. ఏపీ మాజీ మంత్రి, టీడీపీ కీలక నేత ఆదినారాయణరెడ్డి బీజేపీలో చేరారు. సోమవారం ఉదయం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో ఆది కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కండువా కప్పిన నడ్డా సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆదినారాయణరెడ్డి 2014లో జరిగిన ఎన్నికల్లో జమ్మలమడుగు తరువాయి 2లో..

## శివ కుమార్‌తో కుమారస్వామి భేటీ

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో ఈడీ విచారణ ఎదుర్కొంటూ తీహార్ జైలులో ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి డీకే శివకుమార్‌తో కర్నాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి సోమవారం భేటీ అయ్యారు. భేటీ అనంతరం కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ... రాజకీయాలు, తరువాయి 2లో..



### నీతి, నిజాయితీ, చిత్తశుద్ధి..

## కలగలిపితే పోలీసు

- సైబర్ నేరాలు సవాళ్లుగా మారాయి
- అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంత్రి అవంతి

విశాఖపట్నం : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పర్యాటకశాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పోలీసు యూనిఫాంకు ఒక గౌరవం ఉందని, యూనిఫాంకు ఇచ్చే గౌరవాన్ని చూసే చాలామంది యువత పోలీసు ఉద్యోగాల్లో చేరుతున్నారని తెలిపారు. నీతి, నిజాయితీ, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ.. అసువులు బాసిన పోలీసులను స్మరించుకోవడం తమ కర్తవ్యమని పేర్కొన్నారు. తరువాయి 2లో..



## ప్రభుత్వం ప్రకటించిన 10 వేల వేతనం జీవో

# విడుదల చేయాలంటూ వెలుగు విఓఏలు ధర్నా



తహసీల్దారు రవి కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న మండల విఓఏలు.

చోడవరం : ఏపీ, వెలుగు వి.ఓ.ఏలకు ప్రభుత్వం ప్రకటించిన10 వేలు వేతనం జీఓ విడుదల చేయాలని, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని కోరుతూ చోడవరం మండల విఓఏలు సోమవారం ధర్నా చేపట్టారు. వి.ఓ.ఏల రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టి అనంతరం తహసీల్దారు రవికుమార్, ఎం.పి డీవో దుర్గా శ్యామ్ సుందర్‌కు మండల విఓఏలు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతన బకాయిలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, గ్రామ సంఘాలు నడపటానికి అవసరమైన ఆదాయ వనరులు కల్పించాలని విఓఏలు ప్రభుత్వాన్ని కోరారు.



**వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ విశాఖ నగర యువజన అధ్యక్షుడు కొండారాజీవ్‌గాంధీని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి నియమించిన సందర్భంగా... ఏపీ స్టేట్‌వైడ్ అక్కినేని ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ పార్లమెంట్ వైఎస్ఆర్ పార్టీ బీసీ సెల్ కార్యదర్శి బి.రాముయాదవ్ కొండా రాజీవ్‌గాంధీ కార్యాలయంలో కలిసి పూలబొకే ఇచ్చి సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.**



విశాఖపట్నంలో గ్రామ వార్డ్ సచివాలయ, (హార్టికల్చర్ )లైబ్రెరీ సైన్స్ నిరుద్యోగులు, గవర్నర్‌ను కలిసి వయోపరిమితి సడలింపుపై ఏపీ నిరుద్యోగ జేఏసీ హేమంత్ కుమార్ కలిసి వినతిపత్రం అందించారు.

## విఓఏలకు పెంచిన రూ.10వేలు వేతనం జీఓ

# వెంటనే విడుదల చేయాలి : సిఐటియు ధర్నా




సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం విఓఏలకు పెంచిన రూ.10 వేలు వేతనం జీఓ వెంటనే విడుదల చేయాలని జిల్లా సిఐటియు కార్యవర్గ సభ్యుడు గండి నాయనిబాబు డిమాండ్ చేసారు. మండల కేంద్రంలోని సోమవారం స్థానిక దుర్గాలమ్మ గుడి దగ్గర నుండి వెలుగు కార్యాలయం వరకు విఓఏలు, సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా చేసి స్థానిక తహశీల్థార్ కె.రమాదేవికి సిఐటియు కార్యవర్గ సభ్యులు గండి నాయనిబాబు, యు సత్యవతి, విఓఏలు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గండి నాయని బాబు మాట్లాడుతూ విఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు వేతనం ప్రకటన చేసి 4 నెలలు దాటింది. కానీ నేటికీ జీఓ విడుదల చేయలేదు. జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు జీతం,భత్యం లేకుండా పనిచేసిన విఓఏలను ఏ కారణం లేకుండా తొలగించడం అన్యాయమని డిమాండ్ చేసారు. వీఓఏల ఉద్యోగ భద్రతకై హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, విఓఏల తొలగింపులు, రాజకీయ వేధింపులు వెంటనే ఆపాలని, తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేసారు. కావున తమరు వెంటనే స్పందించి తొలగింపులు, వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు యు సత్యవతి, సిఐటియు మండల కార్యదర్శి జి.అప్పారావు, సిఐటియు నాయకులు ఎమ్.గౌరీష్, చంటి విఓఏలు గొర్లి పుష్ప, గొంప శివ, సబ్బవరపు కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమర వీరులకు ఘననివాళి

### - దేవరాపల్లిలో భారీ ర్యాలీ



దేవరాపల్లి : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమర వీరుల కు పోలీస్ సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం దేవరాపల్లిలో సోమవారం వివిధ పాఠశాల కళాశాల విద్యార్థిని విద్యార్థులతో స్థానిక ఎస్సై పి.నరసింహమూర్తి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి అమరవీరులకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటిం చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అమరవీరులకు ఆత్మ శాంతి చేకూర్చాలని ప్రతి ఒక్కరూ ప్రార్థిద్దాం అన్నారు. ఈ కార్య క్రమంలో సీయోను ప్రార్థన మందిరం బిషప్ రెవ. జి. టైటస్, జూనియర్ కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంతానం లేని దంపతులకు

# ఐవిఎఫ్ చికిత్స ఓ వరం

విశాఖపట్నం : సంతానం లేని దంపతులకు ఐవిఎఫ్ చికిత్స అనే ఓ వరం అని లండన్ సంతాన సాఫల్య కేంద్రం ఎండి డాక్టర్ కె.చంద్రారెడ్డి, డా.అణన్య అన్నారు. ఐవిఎఫ్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. సహజ పద్ధతిలో పిల్లలు కలగని వారు నిర్ణీత వయస్సు దాటిపోకుండా ఐవిఎఫ్ సంప్రదిస్తే తల్లిదండ్రులు కావచ్చన్నారు. గర్భదావతి వయస్సు పెరిగే కొద్ది ప్రసూతి, పిండ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా వుంటాయన్నారు.

# జీతాలు వెంటనే చెల్లించాలి

### వసతి గృహ దినసరి కూలీలు



అనంతగిరి : మండల కేంద్రం, అనంతగిరి మండలం లో గల గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న విద్యార్థినీ విద్యార్థుల వసతి గ ృహంలో పనిచేయుచున్న రోజువారి కూలీలకు ఎనిమిది నెలల నుంచి జీతములు ఇవ్వలేదని జీతాలు లేక మా కుటుంబ పోషణ భారంగా ఉందని ప్రభుత్వం వారు స్పందించి మాకు వెంటనే జీతాలను ఇప్పించాలని కోరుతూ అనంతగిరి మండల తహసీల్దార్ వెంకట వరప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దీసరి గంగరాజు పాల్గొన్నారు.

## కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఆధ్వర్యంలో

# ఉచిత హోమియో శిబిరం



భీమునిపట్నం: స్థానిక డచ్ రోడ్డు లో ఉన్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఆధ్వర్యంలో ఉచిత హోమియో శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి ఆధ్వర్యంలో హోమియో డాక్టర్లు జగన్నాథ రావు, మోహన్ రావు సుమారు 200మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సి.హెచ్ చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావు,ఎం.శంకర్రావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అనాధ బాలల పాఠశాల ప్రారంభం



భీమునిపట్టణం: భీమిలి మండలం నిడిగట్టు పంచాయితీ నేరళ్ల వలసకాలని లో సర్వశిక్షాఅభియాన్ అధ్వర్యంలో అనాధ బాలల పాఠశాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. పాఠశాల ఒక కోటి 5 లక్షలతో నిర్మించటం జరిగింది. మంత్రి మాట్లాడుతూ ఈ యొక్క పాఠశాలకు కావలసిన అన్ని వసతులకు పార్లమెంట్ సభ్యులు యొక్క సహకారం తోఅన్ని మౌలిక సదుపాయాలు కలిపిస్తామని తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు తల్లి తండ్రులుగా ప్రతీ ఉపాధ్యా యుడు బాధ్యతగా వహించి వాళ్ళని అన్ని రంగాలలో ప్రతిభ కనపరిచేటట్టుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం మంత్రి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎం.పి ఎం.వి.వి సత్యనారాయణ, భీమిలి నియోజవర్గ ఇన్‌చార్జ్ ముత్తంశెట్టి మహేష్, నియోజవర్గ నాయకులు పెద బాబు, కోరాడ వెంకటరావు, వూళ్ళ చిన్నారావు, గాడు వెంకటప్పడు, మణిశంకర్ నాయుడు, యలమంచిలి సుర్యనారాయణ, డి కొండబాబు, అమర్, నల్ల బాబు, చిల్లా కరుణాకర్ రెడ్డి, జి.సన్యాసిరావు,శ్రీనివాస రెడ్డి, వూళ్ళ చంద్ర శేఖర్,మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నరసింగరావు, గుండాసు మదునాయుడు, చెల్లూరి గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## పోలీసు అమర వీరులకు సెల్యూట్

బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే ఎంతవారినైన చట్టం ముందు నిలబెట్టమని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సమావేశంలోనే చెప్పాను. ఒక్కొక్కరికి ఒక్కో రూల్ ఉండకూడదు. చట్టం అనేది అందరికి ఒకటే.. అది కొందరికి చుట్టం కాకూడదు. పోలీసులు ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి అని పిలుపునిచ్చారు.

తొలి రాష్ట్రం మనదే..

సీఎం జగన్ తన ప్రసంగం కొనసాగిస్తూ.. పోలీసులు సెలవులు లేకుండా కష్టపడుతున్నారని నాకు తెలుసు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసులకు వీక్లీ ఆఫ్ ప్రకటించాం. అలా చేసిన తొలి రాష్ట్రం మనదే. వారంలో ఒకరోజు పోలీసులు తమ కుటుంబంతో గడిపితే మానసికంగా బలంగా ఉంటారు. లంచగొండితనం, అవినీతి, రౌడీయిజంపై నిజాయితీగా మీరు యుద్ధం చేయాలి. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హోంగార్డుల జీతాలను రూ. 18 వేల నుంచి రూ. 21 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం. హోంగార్డులు మరణిస్తే రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన తొలి రాష్ట్రం కూడా మనదేనని గర్వంగా చెబుతున్నా. విధి నిర్వహణలో హోంగార్డులు మరణిస్తే రూ. 30 లక్షలు, పోలీసులు మరణిస్తే 40 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్ సదుపాయాన్ని తీసుకొచ్చాం. రిటైర్డు సిబ్బందికి కూడా బీమా వర్తిస్తుంది.

కన్నీళ్లు వస్తున్నాయి హోం మంత్రి సుచరిత

పోలీసులు త్యాగానికి నిలువుటద్దం అని.. వారి త్యాగాలు వింటుంటే కన్నీళ్లు వస్తున్నాయని రాష్ట్ర హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. విజయవాడలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు. శాంతి భద్రతలు పర్యవేక్షించే హోం మంత్రిగా తనకు సీఎం జగన్ అప్పగించిన బాధ్యతలను సంపూర్ణంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఇందులో భాగంగా భారీగా ఉద్యోగాలు కల్పించి పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా బాలికలు, మహిళ సంరక్షణ కోసం మహిళ మిత్ర ఏర్పాటు చేశామని వెల్లడించారు.

## ఏపీలో జిల్లాలకు కొత్త ఇన్‌ఛార్జి మంత్రులు

రెడ్డి, నెల్లూరు - బాలినేని శ్రీనివాస రెడ్డి, కర్నూలు - అనిల్ కుమార్ యాదవ్, వైఎస్ఆర్ కడప - ఆదిమూలపు సురేష్, అనంతపురం - బొత్స సత్యనారాయణ, చిత్తూరు - మేకపాటి గౌతమ్ రెడ్డి

## టీడీపీకి షాక్..

నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం టీడీపీలో చేరి మంత్రి పదవిని దక్కించుకున్నారు. టీడీపీలో కీలక నేతగా వ్యవహరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపులో కీలకంగా వ్యవహరించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి కడప పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీతో అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయన బీజేపీలో చేరుతున్నట్లు చాలా రోజులుగా ప్రచారం జరిగింది. ఇటీవలి కాలంలో బీజేపీలో చేరేందుకు ఓసారి ఢిల్లీ వెళ్లారు. కొన్ని కారణాల వల్ల అప్పట్లో జాయిన్ కాలేదు.. అయితే సోమవారం ఢిల్లీ వేదికగా జేపీ నడ్డా సమక్షంలో ఆది కాషాయ కండువా కప్పేసుకున్నారు. కాగా కడప జిల్లాలో టీడీపీ కీలకనేతగా ఉన్న ఆది బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆ పార్టీకి షాక్ తగిలినట్లైంది.

## శివ కుమార్‌తో కుమారస్వామి భేటీ

వ్యక్తిగత పరిచయాలు రెండూ వేరువేరని చెప్పారు. ఇది కేవలం తన వ్యక్తిగత భేటీ అని హెచ్‌డీ తెలిపారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా డీకేను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తాను అండగా ఉన్నానన్న భరోసా ఇచ్చేందుకు భేటీ అయినట్లు చెప్పారు. డీకే శివకుమార్ మానసికంగా దృఢంగా ఉన్నారని.. ఈ రాజకీయ కక్ష సాధింపులపై తాము పోరాడతామని కుమారస్వామి స్పష్టం చేశారు.

## నీతి, నిజాయితీ, చిత్తశుద్ధి.. కలగలిపితే పోలీసు

పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని ఆలోచించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీక్లీ ఆఫ్ నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని మంత్రి అవంతి శ్రీనివాస్ గుర్తు చేశారు. రాష్టంలో తీవ్రవాదం, నక్సలిజం రెండింటినీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కుంటున్నారని, గంజాయి స్మగ్లింగ్‌ను రూరల్ పోలీసులు నియంత్రణలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అదే విధంగా విశాఖకు సైబర్ నేరాలు సవాళ్లుగా మారాయని.. అనేకమంది చిన్నారులు ఆన్‌లైన్ గేమ్‌ల ద్వారా డబ్బులు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని పోలీసులు నియంత్రించాల్సిన అవశ్యకత ఉందని, దీనికి టెక్నాలజీని వాడుకోవాలని మంత్రి సూచించారు.



*విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం నియోజకవర్గమునకు చెందిన సిరి చందన అనారోగ్యం తో బాధపడుతున్నారు. వారికి చికిత్స నిమిత్తం మంత్రివర్యులు ముత్తం శెట్టి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ 5,20,0000 రూపాయలు ఆర్థిక సహాయం మంజూరు చేయించడం జరిగింది. ఆదివారం భీమిలి వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు సహాయనిధి చెక్కను మంత్రివర్యులు ముత్తం శెట్టి శ్రీనివాసరావు అందజేశారు.*

## కారు డ్రైవర్‌పై కత్తితో దాడి



కంచరపాలెం : కారు డ్రైవర్ పై కత్తి తో దాడి చేసిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిది లో ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో బర్మా క్యాంప్ జై భారత్ నగర్ వద్ద జరిగింది . ఘటనకు సంబందించి కంచరపాలెం సి.ఐ కృష్ణరావు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి . బర్మా క్యాంప్ జై భారత్ నగర్ వద్ద నివాసముంటున్న శ్యామల జగదీష్ ( 32 ) కారు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు . అతడి స్నేహితుడైన నాగార్జున కు ఈనెల 16 వ తేది నా శ్యామల జగదీష్ 13 వేల రూపాయలు అప్పుగా ఇచ్చాడు . అయితే నాగార్జున తనకు పరిచయం ఉన్న స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తున్న వ్యక్తి జగదీష్ అలియాస్ ( జగ్గు ) కు 13 రూపాయలు ఇచ్చాడు . ఇదిలా ఉండగా రెండు రోజుల వ్యవధిలో జగదీష్ అలియాస్ ( జగ్గు ) నాగార్జునకి 10 నగదు ముట్టజెప్పాడు. మిగిత డబ్బులు ఎప్పుడు చెల్లిస్తావని నాగార్జున అడుగుతుండటంతో జగదీష్ అలియాస్ ( జగ్గు ) మాట దాటవేస్తూ నిర్లక్ష్య సమాధానం చెప్తున్నాడు . ఈనెల 20 వ తేది మద్యాహ్నం శ్యామల జగదీష్ మరియు అతడి స్నేహితుడు నాగర్జున జగదీష్ అలియాస్ ( జగ్గు ) తమ బాకీ సొమ్ము 3 వేల రూపాయలు ఇవ్వాలని అడిగారు . మీకుఎందుకు డబ్బులు ఇవ్వాలని జగదీష్ అలియాస్ ( జగ్గు ) ని నిలదీశారు దింతో ముగ్గురి మధ్య గొడవ జరిగింది. దింతో కక్ష పెంచుకున్న జగదీష్ అలియాస్ ( జగ్గు ) 21 వతేది ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో బర్మా క్యాంప్ జై భారత్ నగర్ నూకాలమ్మ ఆలయ సమీపంలో రహదారి వద్ద జగదీష్ అలియాస్ ( జగ్గు ) అతడి స్నేహితులు కుమార్ , కార్తీక్ అలియాస్ ( సాయి కిరణ్ ) కొంతమంది శ్యామల జగదీష్ తో ఘర్షణకు దిగారు. అప్పటికే జగదీష్ అలియాస్ ( జగ్గు ) తనతో తెచ్చుకున్న కత్తితో శ్యామల జగదీష్ పై దాడి కి దిగాడు దింతో శ్యామల జగదీష్ కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కంచరపాలెం పోలీసు లకు సమాచారం అందించారు.

# ఘనంగా పోలీసుల అమరవీరుల వారోత్సవాలు

కొయ్యూరుః మండలంలో పోలీసుల అమరవీరుల వారోత్సవాను కొయ్యూరు ఎస్. ఐ . రెడ్డి అసిరి తాత, మంప ఎస్. ఐ . సన్నిబాబుల ఆధ్వర్యంలో, ర్యాలీ నిర్వహించారురు . సిఏహెచ్ స్కూల్ బాయ్స్ వన్ విద్యార్థులతో ర్యాలీలో పాల్గొని, విధి నిర్వహణలోలో ప్రాణాలు కోల్పోయిన, పోలీసులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేసుకుంటూ కొయ్యూరు నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. కొయ్యూరు ఎస్సై రెడ్డి సిరి తాత, మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు, ముందుగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనునిత్యం ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అండగా అ ఉంటారన్నారు. సంఘ విద్రోహ చర్యలకు వైపు , చూడకుండా ,మంచి మార్గంలో. నడవాలని ఆయనకోరారు. మంప ఎస్ ఐ. సన్ని బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యా రంగం వైపు పయనించాలని అన్నారు . మంచి ఉద్యోగాలు సంపాదించి ఊరికి ,దేశం కు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ఆదివారం నాడు కొయ్యూరు ,మంప ఎస్ఐలు పలుచోట్ల బాయ్స్ వన్ ,ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి, 3ని రన్ నిర్వహించారు రు. రన్ కేవలం శారీరక దృఢత్వం కోసం మాత్రమే కాదని, ఇటువంటి కార్యక్రమాల వల్ల సామాజిక స్పృహ ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లో పి డి అంబటి నూకరాజు పి ఈ టి గోపాల్ తో పాటు ఏ పీ ఎస్ పి పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

# నితిన్ సాయికి గీతం పిహెచ్‌డి అవార్డు



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః ఆద్రప్రదేశ్‌లోని విజయ మరియు సంగం పాల డైరీలలో మానవ వనరుల విభాగం అనుసరిస్తున్న విధానాలు ఉద్యోగుల సంతృప్తి స్థాయి అనే అంశం పై జరిపిన పరిశోధనలకు గాను కొల్లి నితిన్‌సాయికి గీతం డీమ్డ్ విశ్వవిదాయలయం పిహెచ్‌డి అవార్డును ప్రకటించింది. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సీనయర్ ప్రొఫెసర్ జి.రాఘవయ్య పర్యవేక్షణలో తన పరిశోధన జరిపినట్లు డాక్టర్ నితిన్ సాయి తెలిపారు. మానవ వనరులను సంస్థ ప్రగతికి ఉపయోగించుకోవాలంటే ఈ రెండు డైరీలలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని, సంస్థకు అనువైన హెచ్.ఆర్. విధానాలను రూపొందించుకోవాలని ఆయన సూచించారు.

# అలేఖ్య హత్యకేసులో నిందుతుడు అరెస్టు

సింథియా: ఆర్బర్ సబ్ డివిజన్ మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధి మల్కాపురం ప్రియదర్శిని కాలనీలో ఇటీవల జరిగిన షాహుకారి అలేఖ్య(26) హత్యకేసులో నిందుతుడు బొల్లిసతీష్‌కుమార్‌ను సోమవారం మల్కాపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం........శ్రీకాకుళం గారా గ్రామానికి చెందిన నిందుతుడు బొల్లి సతీష్‌కుమార్ మల్కాపురం ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉంటున్న మృతిరాలు షాహుకారి అలేఖ్య ఇంటికి ఈ నెల 16వ తేదీ రాత్రి సుమారు 7గం. ప్రాంతంలో ఇంటికి వచ్చాడు. ఆరాత్రి ఇంటిలోనే ఉండి మరుసటి రోజు 17వతేదీన ఉదయం ఇరువురి మధ్య మనస్పర్థలు వచ్చి గొడవ పడి, ఆగొడవలో ఉదయం9గం45ని సమయంలో నిందుతుడైన బొల్లి సతీష్‌కుమార్ ఆ ఇంట్లోనే ఉన్న నైలాన్ త్రాడును బాత్రురూంలో బట్టలు తగిలించుకునే ఉక్కుకు ఒక చివరకట్టి అలేఖ్య వంటింట్లో పనిచేస్తుండగా నిందుతుడు ఆమె వద్దకు వెళ్ళి బలవంతంగా ఆమెను బాత్‌రూంలోనికి లాక్కొని వెళ్ళి ముందుగా వ్రేలాడి ఉంచిన త్రాడును ఆమె మెడకు చుట్టి బలంగా లాగి, ఆమెకు ఊపిరి ఆడకుండా చేసి చంపేసాడు. నిందుతుడు అక్కడనుంచి పారిపోయి 20వ తేదీ మధ్యాహ్నం సుమారు 12గం. సమయంలో ములగాడ తహాశీల్దార్ ఎదుట నిందుతుడు సతీష్‌కుమార్ తను చేసిన నేరాన్ని అంగీకరిస్తూ లొంగిపోయాడు. దీంతో నిందుతుని తహాశీల్దార్ మల్కాపురం పోలీసులకు అప్పజెప్పగా నిందుతుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు మల్కాపురం సి.ఐ. పల్లా వెంకట భాను ఉదయ్‌కుమార్ తెలిపారు.

# ఉద్యోగుల ఆరోగ్యమే బ్రాండిక్స్ ధ్యేయం

**బ్రాండిక్స్ భారత బాగస్వామి దొరస్వామి**



అచ్యుతాపురం : ఉద్యోగుల రక్షణతో పాటు , ఉద్యోగుల ఆరోగ్యంపై కూడ తగిన శ్రద్ధ తీసుకుంటున్నామని బ్రాండిక్స్ భారత బాగస్వామి దొరస్వామి అన్నారు .సోమవారం ఆయన బ్రాండిక్స్ 2 లో కాంటీన్ ను సందర్శించారు . ఉద్యోగుల ఆరోగ్యం కోసం కాంటీన్ లో జంక్ ఫుడ్,కూల్ డ్రింక్స్ నిషేదించామని , కాంటీన్ లో పోషక ఆహార పదార్థాలు ఉంటాయన్నారు .

# జివిఎంసి స్పందనకు 137 ఫిర్యాదులు

**అదనపు కమిషనర్ ఎ.వి. రమణి**



విశాఖపట్నం: స్పందనలో నమోదైన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని జివిఎంసి అదనపు కమిషనర్ ఎ.వి.రమణి పేర్కొన్నారు. అదేవిధంగా ఫిర్యాదు పరిష్కారం అయిన తరువాత ఆ విషయాన్ని ఫిర్యాదుదారుకు తెలియజేయడంతోపాటు స్పందన రిజిష్టర్‌లో నమోదు చేయాలని వివరించారు.

జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మొత్తం 161 ఫిర్యాదులందాయి. వాటిలో 75 ప్రధాన కమిషనర్‌కు 1వ జోన్‌కు 20, 4వ జోన్‌కు 2, 5వ జోన్‌కు 58, 6వ జోన్‌కు 6, అనకాపల్లికి, భీమిలికి నిల్ ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటిని సకాలంలో పరిశీలించాలని ఆదేశించారు.

# డయల్ యువర్ కమిషనర్‌కు 8 ఫిర్యాదులు



విశాఖపట్నం: జి.వి.ఎం.సి. ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెం.1800-4250-0009) కార్యక్రమానికి 8 ఫిర్యాదులందాయి. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు హాజరై పలువురినుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో 1వ జోన్‌కు సంబంధించి 0, రెండవ జోన్‌కు సంబంధించి 1, మూడవ జోన్‌కు 2, 4వ జోన్‌కు 1, 5వ జోన్‌కు నిల్, 6వ జోన్‌కు 4 కాల్స్ రాగా అనకాపల్లి, భీమిలినుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ రాలేదు. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 10 కాల్స్



విశాఖపట్నం: సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పదిమంది ఫోన్ ద్వారా అభ్యర్థనలు, ఫిర్యాదులు చేశారు. వారికి ఫోన్ లో జెసి2 ఎమ్. వి. సూర్యకళ సమాధానాలిచ్చారు.

నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామం నుండి నాగేశ్వరరావు ఫోన్ చేస్తూ తాను ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకున్నా నేటి వరకు సొమ్ము చెల్లింపు చేయలేదని ఫిర్యాదు చేశారు. రోలుగుంట మండలం బుచ్చం పేట గ్రామం నుండి పోతురాజు నాయుడు ఫోన్ చేస్తూ తమ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఒకే గదిలో నడుస్తున్నదని మిగిలిన తరగతులు చెట్ల కింద జరుగుతున్నాయని వెంటనే కొత్త భవనాలు నిర్మించాలని కోరారు.

విశాఖపట్నం నుండి గిరిబాబు మాట్లాడుతూ తాను పెట్రోల్ బంక్ లైసెన్స్ కి దరఖాస్తు చేసుకున్నానని ఎన్ ఓ సి కొరకు కలెక్టరేట్లోని సి సెక్షన్ లో పెండింగ్ లో ఉందని త్వరగా మంజూరు చేయవలసిందిగా కోరారు.

నర్సీపట్నం నుండి శివ నారాయణ రాజు ఫోన్ చేసి మున్సిపాలిటీలో నిబంధనలు పాటించడం లేదని, సుప్రీంకోర్టు నిబంధనలు బేఖాతరు చేస్తూ చెరువు పోరంబోకు లో భవనాలు నిర్మిస్తున్నారని, పట్నం లోని బైపాస్ రోడ్డు ను ఆక్రమిస్తూ భవనాలు ఉన్నాయని అందువలన ట్రాఫిక్ జామ్ అవుతుందని ఫిర్యాదులు చేశారు. విశాఖపట్నం 18 వార్డు నుండి కె వి ఎన్ జి మూర్తి ఫోన్ చేస్తూ తమ వార్డులోని కమ్యూనిటీ హాలు చేపల బజారు ప్రాంతంలో పారిశుద్ధ్యం సరిగా లేదని సిరిపురం దత్ ఐల్యాండ్ వద్ద రోడ్డు గోతులు పడి ఉన్నదని తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

# స్ఫూర్తి అనాధాశ్రమానికి నిత్యవసర సరుకు అందజేత



గాజువాక: జీవీయంసీ 50వ వార్డు నేతాజీకాలనీప్రాంతానికి చెందిన జనసేన యువత సొంత నిధులతో స్ఫూర్తి ఆనాధాశ్రమ పిల్లలకోసం నిత్యవసరసరుకులైన బియ్యం, వంటనూనె, పిల్లలు పుస్తకాలను దాచుకునేందుకు అలమరలాంటి రేఖను అందజేయడం జరిగింది. జనసేన మహిళా నాయకురాలు రెయ్యిరత్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా రెయ్యిరత్నం మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది అనాధులుగా జీవిస్తున్నారని, వారికి మనకున్న దానిలో ఎంతో కొంత సహాయం చేసి వారిని ఆదుకోవలసిన అవసరం ఎంతైన ఉందదని అన్నారు. తొటి వారిని ఆదుకోవడం, వారికి సహకరించడం మన కనీసబాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన యువత హరిబాబు, షణ్ముక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోరమండల్ ఎంప్లాయిస్ ఫెర్టిలైజర్స్ యూనియన్ 50వ వ్యవస్థాపక దినోత్సవం



సింథియా: కోరమండల్ ఎంప్లాయిస్ ఫెర్టిలైజర్స్ యూనియన్ 50వ వ్యవస్థాపక దినోత్సవం "స్వర్ణోత్సవ" వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పారిశ్రామిక ప్రాంతంలోని కోరమండల్ సంస్థ ఆవరణలో గల యూనియన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.యం.భాషా యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక యూనియన్ 50సం పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 50సం.లలో యూనియన్ చేసిన సేవలను, విజయాలను స్మరించుకున్నారు. ఇది కార్మికుల ఐక్కతతోనే సాధ్యమైందని అన్నారు. 2019సం. వేతన ఒప్పందాన్ని యూనియన్ అధ్యక్షులు సి.హెచ్.నర్శింగరావు నాయకత్వంలో నవంబరు నెలలో సాధించుకోవాలని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. అందరి కార్మికులతో 'ప్రతిజ్ఞ' చేయించారు. 50సం.స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా కె.జి.హెచ్ ఆవరణలో అక్షయ్ ఫౌండేషన్ ద్వారా అన్నదానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు, యూనియన్ ప్రతినిధులు జె.సందీప్‌కుమార్, ఎ.రామారావు, కె.సంతోష్‌కుమార్, పి.సుధాకర్, పియన్ఎస్‌యన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గుంతలపడిన రహదారిని బాగుచేయ్యండి



గాజువాక: జీవీయంసీ 61వ వార్డు సనత్‌నగర్ ఏరియాలో ప్రభుత్వపాఠశాల ఎదురుగా ఉన్న రహదారి ఇటీవల వర్షానికి గుంతలుగా ఏర్పడి రహదారి అంతా ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని, రహదారిని బాగుచేయాలని జోన్-5ఇఇ వేణుగోపాలరావుకు జనసేననాయకులు జాగారపు శ్రీను వినతి పత్రాన్ని అందజేసారు.

ఈసందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఇటీవల టాటాకంపినీ కేబుల్ ఏర్పాటు చేయడానికి రహదారిని పూర్తిగా తవ్వడంతో గుంతలు ఏర్పాడ్డాయని, అయితే వాటిని జనసైనికులు సొంత నిధులతో గుంతలను పూడ్చామని, కాని ఇటీవల వర్షం కారణంగా రహదారి పూర్తి గా పాడైపోయిందని, గుంతలు ఏర్పడడంతో బాటసారులకు, వాహనదారులకు, ముఖ్యంగా పిల్లలకు చాలా ఇబ్బందిగా ఉందని తక్షణమే రహదారిని మరమతు చేసి, రహదారికి ఇరువైపుల కాలువలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకు రావాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని అన్నారు.

ఇ.ఇ.వేణుగోపాలరావు సానుకూలంగా స్పందించారని తెలిపారు. జాగారపు శ్రీనువెంట జనసైనికులు తదితరులున్నారు.

# *270 టార్పన్లు పంపిణీ*

దేవరాపల్లి : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతులకు టార్పన్లు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కర్ రావు చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.టార్పన్లు ఒక్కొక్కటి రూ. 1750 రూపాయలు కు అందజేస్తున్నామని వ్యవసాయ అధికారిని బి. సంధ్య అన్నారు. మండలానికి 270టార్పన్లు వచ్చాయని కావలసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ఒక పాస్ ఫోటో వెంట తీసుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణఅధికారి ఎస్. కిరణ్ కుమార్, చల్లా తాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖలో స్పందన కార్యాక్రమం



విశాఖపట్నం ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ప్రతి ప్రభుత్వ శాఖలలో ప్రతి సోమవారం స్పందన కార్యాక్రమం చేపట్టాలని ఆదేశాలు ఇచ్చియున్నారు కావున రవాణా శాఖలో కూడా స్పందన కార్యక్రమమును చేయడం జరుగుతుంది. అందులో భాగంగా ఈ రోజు అనగా 21.10.2019 తేదీ విశాఖపట్నం లో ఉప రవాణా కమీషనర్ కార్యాలయంలో 26 దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించడం జరిగింది. ఆటో/ట్యాక్షి/మోటారు క్యాబు వాహన మిత్ర పథకమునకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్న మా కార్యాలయంలో సంప్రదించమని తెలియజేయడమైనది. ఈ యొక్క కార్యాక్రమం ప్రతి సోమవారం విశాఖపట్నం, అనకాపల్లి, గాజువాక కార్యాలయంలో జరుగుతుంది. అలాగే ఆర్.సి.కార్డులు, లైసెన్సు కార్డులుకు సంబంధించినవి మరియు ఇతర సమస్యలు ఏమైనా ఉన్న ఈ యొక్క కార్యాక్రమాని వినియోగించుకోవలసినదిగా ఇందుమూలంగా తెలియజేయడమైంది.

# వీఎంఆర్డీఏ గ్రీవెన్స్‌కు ఏడు దరఖాస్తులు

**వీఎంఆర్డీఏ కమిషనర్ పి. కోటేశ్వర రావు**



సిరిపురం : ప్రతి సోమవారం వీఎంఆర్డీఏ లో నిర్వహించే ఓపెన్ ఫోరం గ్రీవెన్స్ కు ఈ సోమవారం ఏడు దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులను కమిషనర్ పి. కొటేశ్వర రావు స్వీకరించారు. అందిన దరఖాస్తుల పై వారం లోగా చర్యలను తెలియజేస్తామని కమిషనర్ దరఖాస్తుదారులతో తెలిపారు. అందుకున్న దరఖాస్తులను సంబంధిత విభాగాధికారులకు అందజేస్తు వారం లోగా సమాధానాలను ఇవ్వాలని సూచించారు. పరదేశిపాలెంలో ఎల్.పి.నంబర్ .1/2011 ఓజోన్ వేలీ నందు వేసిన లేఅవుట్ లో తన భూమికి నష్ట పరిహారం ఇవ్వాలనికోరుతూ కొల్లా వెంకటేశ్వర్లు దరఖాస్తు చేశారు సెయింట్ జోషెప్స్ సెంట్రల్ స్కూల్ కరస్పాండెంట్ రత్నకుమారి తమ స్కూల్ కు గతంలో స్థలం మంజూరు చేశారని పాఠశాల గుర్తింపు కోసం దరఖాస్తూ చేయగా అభూమి డాక్యుమెంట్లను డి.ఇ. ఓ కోరారని , వుడా నుండి డాక్యుమెంట్లు ఇప్పించాలని అర్జీ చేశారు . ఈరెండు దరఖాస్తులకు సంబంధిచి సెక్రెటరీ, సి.యు.పి వుడా నిబందనలను అనుసరించి వున్నధీ లేనిధీ క్షేత్ర స్థాయి లో తనిఖీ చేసి వారం లోగా నివేధికని అంధించాలని కమిషనర్ పి. కోటేశ్వర రావు ఆదేశించారు , అనకాపల్లి , చెరోలోపల ల్యాండ్ పూలింగ్ పని పూర్తి చేసి , నిష్పత్తి ప్రకారం రైతులకు సైట్లు ఇప్పించాలని కోరుతూ బాపునాయుడు ,రామ అప్పా రావు తదితరులు దరఖాస్తు చేశారు వివరాలను పూర్తిగా అందిస్తే రెవెన్యూ వారితో మాట్లాడి పరిస్కఃరిస్తామని కమిషనర్ తెలిపారు గ్రీన్ బెల్ట్ ఏరియాలో శాశ్వత భవన నిర్మాణాలు , సి.ఆర్.జడ్. నోటిఫికేషన్ కు విరుద్ధముగా వున్నాయని , వాటిని నిలిపి వేయాలని కోరుతూ తెడ్డు శంకర రావు అర్జీ పెట్టుకున్నారు .అక్కిరెడ్డి పాలెం ,పంచవటి టౌన్ షిప్ నివాసి వెంకట రావు వీల్లా యజమాని వుడా రూల్స్ ను అతిక్రమించరాని ఎలాంటి సౌకర్యాలను కల్పించలేదని దరఖాస్తు చెయ్యగా, సెక్రెటరీ, ఎస్.ఇ, సి. యు.పి, స్వయం గా తనిఖీ చేసి వారం లోగా నివేధిక అంధిచాలని సూచించారు నరవ గ్రామంలో వుడా ఆమోధించిన లే ఔట్ నందు ఫ్లాట్ లు కొనుగోలు చేసిన శ్యాంసుధాకరరావు తదితరులు లేఔట్ నందు విధ్యుత్ , వీధి లైట్లు ,డ్రైనేజి ,కాంపౌండ్ వాల్ తదితర సౌకర్యాలు ఏర్పాట్లు గావించలేదని అర్జీ చేశారు. సి. యు.పి తనిఖీ చేయ్యాలని ఆదేశించారు కొప్పర్ల గ్రామం లో వుడా ఆమోదించిన లేఅవుట్ 3 ఏళ్ళు గడిచినప్పటికి ఎటువంటి అభివృద్ధి చేయ్యాలేదని జోగి నాయుడు ఫిర్యాదు చేశారు ఈ గ్రీవెన్స్ నందు సెక్రెటరీ ఏ.శ్రీనివాస్, ఎస్.ఈ రామ్మోహన్ రావు, చీఫ్ అక్కౌంట్స్ అధికారి హరిప్రసాద్, ఏపిఓ తదితరులు హాజరైనారు.

# అజయ్‌కుమార్ సేవలు ప్రశంసనీయం



సింథియా: లైబ్రేరియన్‌గా అజయ్‌కుమార్ అందించిన సేవలు ప్రశంసనీయమని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి. శ్రీరాముర్తి పేర్కొన్నారు. మల్కాపురం ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయాధికారిగా విధులను నిర్వహిస్తున్న వి. అజయ్‌కుమార్ బదిలీపై వాడచీపురుపల్లి గ్రంథాలయానికి వెళ్ళిన నేపధ్యంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనను రచయితులు, సామాజిక కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్చానిచ్చి, శాలువకప్పి మెమెంటో అందజేసారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు టి.రాముర్తి పాల్గొని మాట్లాడుతూ అజయ్‌కుమార్ పాఠకులతో పాటు, సామాజిక కార్యకర్తలతో, రచయితలతో చక్కని సంబంధాలను కొనసాగిస్తు, అనేక ప్రజోపయెగ సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న ప్రముఖ రచయిత, చిత్రకారులు ఎస్.చలపతిరావు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో రచయితులకు,కవులకు అజేయ్‌కుమార్ చక్కని వేదిక కల్పించారని అభినందించారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్.భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతీ ముఖ్యమైన రోజును గ్రంథాలయంలో అజయ్‌కుమార్ నిర్వహించేవారిన ముఖ్యంగా వేసవి శిక్షణా శిభిరాలను, చిన్నారులకు మంచి విషయాలను నేర్పారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచియిత, న్యాయవాది జి.విశ్వనాధరాజు, ప్రముఖ కవి కె.సత్తిరాజు, బి.సత్యానందం, వై.అనసూయదేవి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## ప్రజాతీర్పుపై ఉత్కంఠ

మహారాష్ట్ర, హర్యానా శాసనసభల ఎన్నికల ఘట్టంలో ఈ నెల 21వ తేదీన పోలింగ్ జరుగనుండటంతో ప్రజాతీర్పుపై ఉత్కంఠ నెలకొన్నది. మన దేశ విస్తృతి, భిన్నత్వం దృష్ట్యా సార్వత్రిక ఎన్నికల తర్వాత అప్పుడప్పుడు జరిగే అసెంబ్లీ ఎన్నికలకు కూడా ప్రాధాన్యం ఏర్పడుతుంది. ఈ రెండు రాష్ట్రాలు ఆర్థికరంగంలో అగ్రస్థానాల్లో ఉండటం, రైతువర్గాలు బలంగా ఉండి అసంతృప్తి తో రగిలిపోతుండటం వంటి కారణాల వల్ల ఈ ఎన్నికల పట్ల ఆసక్తి వ్యక్తమవుతున్నది. మహారాష్ట్ర దేశంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. హర్యానా తలసరి ఆదాయంలో (కేంద్ర పాలితాలను మినహాయిస్తే) మూడవ స్థానంలో ఉన్నది. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో జాతీయ సగటుకు మించి దూసుకు పోతున్న రాష్ట్రాలివి. గత ఐదేండ్లలో జాతీయ ఆర్థికరంగ విస్తృతి సగటు వార్షిక రేటు 7.5 శాతం ఉంటే మహారాష్ట్రలో 7.6 శాతం, హర్యానాలో 8.7 శాతం ఉన్నది. 2018 నాటి పెట్టుబడుల అవకాశాల సూచీ ప్రకారం- హర్యానా నాలుగవ, మహారాష్ట్ర ఐదవ స్థానాల్లో ఉన్నాయి. ముంబయి దేశానికే ఆర్థిక రాజధాని. హర్యానాలోని 22 జిల్లాల్లో పద్నాలుగు జాతీయ రాజధాని ప్రాంతంలో ఉన్నాయి. రెండు రాష్ట్రాలు వాహన తయారీ పరిశ్రమల కేంద్రాలు. వాహనాల అమ్మకాలు పడిపోవడం ప్రభావం ఈ రాష్ట్రాలపై ఉంటుంది. ఇతర్రతా పారిశ్రామిక కార్యకలాపాలు తగ్గిపోయాయి. వ్యవసాయ-అనుబంధ కార్యకలాపాలు హర్యానా జీఎస్‌డీపీలో17 శాతం, మహారాష్ట్ర జీఎస్‌డీపీ లో 12 శాతం ఉంటాయి. ఈ రెండు రాష్ట్రాలలో రైతు వర్గాలను మెప్పించడం ఎట్లా అనేది అధికారపక్షాలకు ప్రధాన సమస్యగా మారింది. ఆర్థిక అంశాలపై రాజకీయ సభల్లో పెద్దగా చర్చ సాగనప్పటికీ, ఆర్థిక విధానాల ప్రభావం ఎన్నికలపై పడుతుంది. మహారాష్ట్రలో నూ సోనియాగాంధీ భిన్నవర్గాలను సంబాళించడంతో పాటు పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో పొత్తు పెట్టుకొని బీజేపీకి గట్టి పోటీ ఇస్తున్నారు. బీజేపీ మోదీ-అమిత్ షా నాయకత్వంలో బలంగా ఆత్మవిశ్వాసంతో ఉన్నది. నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ బీజేపీని ఢీకొనగలదా అనే అనుమానాలున్నాయి. బీజేపీకి ముప్పు కనుక ఉంటే అది ప్రధాని మోదీ విధానాల వల్ల, దేశంలో నెలకొన్న పారిశ్రామిక, వ్యవసాయ సంక్షోభం వల్ల. బీజేపీ వ్యతిరేకతను సొమ్ము చేసుకునే స్థాయికి కాంగ్రెస్ చేరుకున్నదా అనేదే ఈ ఎన్నికల్లోతెలిసిపోతుంది. హర్యానాలో 27 శాతం జాట్ ఓటర్లున్నారు. వ్యవసాయ సంక్షోభం మూలంగా వారిలో పేరుకున్న అసంతృప్తి ఏదో రూపంలో వ్యక్తమవుతున్నది. కనీసం 23 అసెంబ్లీ స్థానాలు జాట్ ఆధిత ప్యం గలవే. ఇతర స్థానాల్లోనూ వారి ప్రాబల్యం ఉంటుంది. మొదట జాట్ల నాయకత్వంలోని ప్రాంతీయ పార్టీల మద్దతుతో హర్యానాలో బలపడిన బీజేపీ ఆ తర్వాత స్వయంగా మెజారిటీ సాధించి అధికారం చేపట్టింది. జాట్ ఓటర్లపై ఆధారపడకుండా ఇతరవర్గాలను ఎక్కువగా ఆకర్షించింది. రాష్ట్రంలో జాట్‌వర్గానికి చెందని నాయకుడి (ఖట్టర్)కి మొదటిసారిగా ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. ఈ ఎన్నికలలో జాట్ ప్రాంతంలో పాగా వేయాలని ఇతర పార్టీలలోని ఈ సామాజిక వర్గానికి చెందిన నాయకులను చేర్చుకుంటున్నది. కాంగ్రెస్ పార్టీ జాట్ వర్గాల్లో పేరున్న భూపీందర్ సింగ్ హుడాను ముందుపె ట్టి ప్రచారం చేస్తున్నది. ప్రాంతీయ (జాట్) పార్టీ లు ముక్కలు చెక్కలయ్యాయి. ఓం ప్రకాశ్ చౌతాలా నాయకత్వంలోని ఐఎన్‌ఎల్‌డీ, దుష్యంత్ చౌతాలా స్థాపించుకున్న జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) పరస్పరం ఓట్లు చీల్చుకుంటున్నాయి. శిరోమణి అకాలీదళ్ ఐఎన్‌ఎల్‌డీతో పొత్తు పెట్టుకున్నది. కాంగ్రెస్ పార్టీ అంతః కలహాలను అధిగమించి ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రతిపక్షాలు చీలిపోవడం బీజేపీకి అనుకూలాం శం. మహారాష్ట్రలో కూడా రైతు వర్గమైన మరాఠాలు తీవ్ర అసంతృప్తితో తరచు ఆందోళనలు సాగిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ సంక్షోభం ఈ రెండు రాష్ట్రాలలో ఎంత మేర ప్రభావం చూపుతుందనేది చర్చనీయాంశంగా మారింది. ప్రాంతీయ పార్టీలు రంగంలో ఉన్నప్పటికీ రెండు రాష్ట్రాలలో బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థు లు. మహారాష్ట్రలోని 288 స్థానాలకు జరిగే ఎన్నికలో ఒకవైపు బీజేపీ-శివసేన, మరోవైపు కాంగ్రెస్- ఎన్సీపీ కూటములు తలపడుతున్నాయి. 90 స్థానాలున్న హర్యానాలో ప్రాంతీయ పార్టీలు కూడా రంగంలో ఉన్నప్పటికీ బీజేపీ, కాంగ్రెస్ పరస్పర హననానికి ప్రయత్నిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ పార్టీకి పునరుజ్జీవం కల్పించిన సోనియాగాంధీ ఇప్పుడు మళ్ళా తాత్కాలికంగానైనా సారథ్యం స్వీకరించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన తగ్గింది. రాష్ట్రాల స్థాయిలో నాయకులను మార్చడం, సీనియర్ నాయకులకు భరోసా ఇవ్వడం ద్వారా సోనియాగాంధీ పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. హర్యానాలో రాహుల్ గాంధీ ప్రాబల్యం ఉన్నప్పుడు అశోక్ తన్వర్ హర్యానా పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు.

## అదనపు సమాచార పౌర సంబంధాధికారి కార్యాలయం పరిశీలన

పెద్దాపురం : పెద్దాపురం మున్సిపాలిటీకి చెందిన ఐడిఎస్ఎమ్ టి- కమర్షియల్ కాంప్లెక్స్ భవనంలో గల అదనపు సమాచార పౌర సంబంధాధికారి కార్యాలయాన్ని శనివారం పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ జి.శేఖర్ పరిశీలించారు.కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరడంతో కార్యాలయంనకు వచ్చే పాఠకులకు మరియు మీడియా ప్రతినిధులకు ఇబ్బందికరంగా వున్న దృష్ట్యా గతంలో మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా ఆమేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ జి.శేఖర్ కార్యాలయాన్ని ఎఇ బ్రహ్మ తేజతో కలిసి పరిశీలించి, పలు సూచనలు ఇవ్వడం జరిగింది.

## స్పందన కార్యక్రమంలో 4 అర్జీలు



పెద్దాపురం : పెద్దా పురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్య క్రమానికి 4 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. వీటిలో ఇళ్ల స్థలం మంజూరు చేయించమని ఒకటి, ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇప్పించమని ఒకటి, డి ఫామ్ పట్టా ఇప్పించమని ఒకటి, ఆక్రమించుకున్న స్థలాన్ని తిరిగి ఇప్పించమని ఒకటి అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

# పోలీసుల సేవలు ఎనలేనివి

### రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్



శ్రీకాకుళం: రాష్ట్ర శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసుల సేవలు ఎనలేనివని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖామాత్యులు ధర్మాన కృష్ణదాస్ కొనియాడారు. ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడటంలో వారి చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు. సోమవారం ఉదయం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన మంత్రి అనంతరం పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని పెట్టి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరులకు గుర్తుగా దేశం యావత్తు పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటుందని గుర్తుచేసారు. గతేడాది 292 మంది పోలీసులు దేశం కోసం వారి ప్రాణాలను అర్పించారని అన్నారు. ప్రజల ప్రాణాలకు నిరంతరం రక్షకులుగా, సమాజ శాంతి భద్రతస్థాపనకు నిత్యసేవకులుగా పోలీసులు పనిచేస్తుంటారని, మాతృభూమి శ్రేయస్సు కోసం పనిచేసే నిస్వార్థ శ్రామికుడిగా వెలకట్టలేని త్యాగనిరతితో అహర్నిషలు విధులలో పోరాడి అసువులు బాసిన పోలీసు అమరవీరులకు ఈ సందర్భంగా మంత్రి జోహార్లను అర్పించారు. నిస్వార్థ త్యాగమూర్తులను స్మరించుకొని వారి ఆత్మశాంతికి నివాళులు అర్పిద్దామన్నారు. సమాజ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సంఘ విద్రోహ శక్తుల చేతిలో తమ ప్రాణాలను తృణప్రాయంగా పరిత్యజించిన అమరులైన త్యాగమూర్తులను స్మరించుకుందామని చెప్పారు.

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఆర్.ఎన్.అమ్మిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఏడాది అక్టోబర్ 15 నుండి 21 వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలను నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగా అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. గత వారం రోజులుగా పోలీసు శాఖ నుండి అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రకరకాల కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని అన్నారు. ఓపెన్ హౌస్, క్యాండిల్ ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, ఆహారం, పండ్లు పంపిణీ, అన్నిరకాల క్రీడలను నిర్వహించామని చెప్పారు. ప్రజల్లో పోలీసుల త్యాగాలను తెలియజేసేందుకు ఒక ప్రయత్నం చేయడం జరిగిందని తెలిపారు. మన జిల్లాలో గత ఏడాదిలో ఏడుగురు పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారన్నారు. వారికి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల నుండి గట్టి సహకారం లేనిదే శాంతిభద్రతలు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా ఉండదని ఆయన స్పష్టం చేసారు. జిల్లాలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయని, అన్నిరకాలుగా పోలీసుల విధి నిర్వహణలో ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి సహకారం బాగా ఉందన్నారు. ఈ స్ఫూర్తితో పోలీసు శాఖ మరిన్ని సేవలు అందించేందుకు సమాయత్తమై ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డా. కిల్లి కృపారాణి, మాజీ శాసనసభ్యులు గుండ లక్ష్మీదేవి, నగరపాలక సంస్థ కమీషనర్ యం.గీత, అంధవరపు వరహా నరసింహం, జిల్లాకు చెందిన డి.యస్.పిలు, ఏ.ఎస్.పిలు, సర్కిల్ ఇన్ స్పెక్టర్లు, సబ్ ఇన్ స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు ఘనస్వాగతం



నాతవలసః తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుజు నారా చంద్రబాబు నాయుడు సోమవారం శ్రీకాకుళం పర్యటనకు విశాఖపట్నం నుండి విజయనగరం జిల్లా మీదుగా వెళ్లడం జరిగింది.. నాతవలస జంక్షన్ వద్ద ఉదయం 10 గంటల సమయంలో జిల్లా నుండి పార్టీ నాయకులు అందరూ వెళ్లి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహంతి చిన్నంనాయుడు, ఐ.వి.పి.రాజు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామి నాయుడు, కిమిడి మృణాళిని, డా. కొండపల్లి అప్పలనాయుడు, బొబ్బిలి చిరంజీవులు, మీసాల గీత, ఆర్.పి.భంజదేవ్, కిమిడి గణపతిరావు, నియోజకవర్గ ఇంచార్జి శ్రీ కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి యెస్.ఎన్. ఎం.రాజు, జిల్లా గ్రంధాలయం మాజీ చైర్మన్ బొద్దుల నర్సింగరావు, మునిసిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, కనకల మురళీమోహన్, జిల్లా యువత అధ్యక్షులు కర్రోతు నర్సింగరావు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎస్కే.ఎం.భాషా, జిల్లా టిఎన్‌టియుసి అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్లు మైలపల్లి పైడిరాజు, గేదెలు ఆడిబాబు, కొంద్రు శ్రీను, గార సత్యనారాయణ, జిల్లా నందమూరి ఫాన్స్ ఉపాధ్యక్షుడు బంటుపల్లి రమేష్, యువత నాయకులు పొలినేటి మహేష్, గోలగన సురేంద్ర, పాలూరి రాజునాయుడు,చిగురుపాటి కుటుంబరావు, మరియు నెల్లిమర్ల నియోజకవర్గ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మహాత్మగాంధీ సంకల్ప యాత్ర : చిలుకూరి




అన్నవరం : తూ.గో.జిల్లా మహాత్మ గాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సంకల్ప యాత్రను నిర్వహించాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు శంఖవరం మండలం మండపం, కొండగౌరంపేట గ్రామాల్లో బిజెపి కార్యకర్తలు ఏర్పాటుచేసిన సంకల్ప పాదయాత్రలో భాగంగా బిజెపి జాతీయ నాయకులు సత్యగోపినాథ్ దాస్ మరియు బిజెపి రాష్ట్ర కో-ఇన్చార్జి మధుకర్ లు విచ్చేసి ప్రసంగించారు. నియోజకవర్గానికి వచ్చిన స్వామీజీ,మరియు ఎపి బిజెపి కో ఇంచార్జి మధుకర్ కి బీజేపీ ఇంచార్జ్ చిలుకూరి.రామ్ కుమార్,మరియు శంఖవరం మండల ప్రధానకార్యదర్శి పడాల.నాగు స్థానిక కార్యకర్తలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మండ పం గ్రామం లో గల మహాత్మా గాంధీ, మరియు డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహలకి పూల మాలలు వేసి సంకల్ప పాదయాత్ర మండపం గ్రామ వీధుల మీదగా సాగి. గౌరంపేట చేరుకుంది అనంతరం ఆ గ్రామానికి సంబందించి గోలగాని.రాజ్ కుమార్ తోపాటు దాదాపు 300 మంది గ్రామస్థులు రామ్ కుమార్ మరియు పడాల నాగు ఆధ్వర్యంలో సత్యగోపినాథ్దాస్ మరియు మధుకర్ సమక్షంలో బిజెపిలో జాయిన్ అయ్యారు.ఈ సందర్భంగా స్వామీజీ గోపీనాథ్ దాస్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం రావాలంటే అది ఒక్క నరేంద్ర మోడీ నాయకత్వంలోనే సాధ్యమవుతుందని స్వామీజీ పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ ఇన్చార్జ్ చిలుకూరి.రామ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలు ఇంత అద్భుతంగా అభివ ృద్ధి చెందుతున్నాయంటే అందుకు కారణం దేశ ప్రధాని నరేంద్ర మోడీ గ్రామాలకు వెచ్చించిన స్వచ్ఛభారత్ నిధుల వల్లేనని ఆయన వివరించారు. అలాగే తమ కార్యకర్తల జోలికి ఎవరైనా వస్తే చూస్తూ ఉరుకోవని ఎదుటి వారి ప్రవర్తన బట్టే తమ పార్టీ ప్రవర్తన ఉంటుందని తెలిపారు. అలాగే నేషనల్ బోర్డు డైరెక్టర్ సత్య కృష్ణంరాజు మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలిత ప్రాంతాలన్నీ అభివ ృద్ధి పథంలో దూసుకు పోతున్నాయని అదే మాదిరిగా మన తెలుగు రాష్ట్రాల్లో కూడా బీజేపీనీ అధికారంలోకి తెచ్చేందుకు పార్టీ శ్రేణులు తోపాటు కార్యకర్త లందరూ పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తోట. సర్వారాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిలిదేవి సత్తిరాజు,రాష్ట్ర అధికార ప్రతినిధి తుమ్మల పద్మజ, గంటా బాలుదొర, అప్పికొండ జోగి బాబు, గోలగాని రాజ్ కుమార్,ఎమ్మిలి పైడిపాల, గింజాల శ్రీను, చాగంటి. రాజులు,బండి.గొల్లబాబు, శ్రీను,పోతుల.రాజ్యలక్ష్మి, నక్కా పోమయ్య, వరహాలు, దాకే కృష్ణరావు,అయినవిల్లి సుదీర్ బిజెపి కార్యకర్తలు పెద్ద పాల్గొన్నారు.

## అనకాపల్లిలో రౌడీషీటర్ రాజేష్ దారుణ హత్య





అనకాపల్లి : స్థానిక గవరపాలెం రౌడీషీటర్ కర్రి రాజేష్ హత్యకు గురి కావడం ప్రస్తుతం సంచలనం సృష్టించింది. కొద్ది రోజులుగా ఎంతో ప్రశాంతంగా ఉన్న అనకాపల్లి ప్రాంతం ఈ ఉదంతంతో ఉలిక్కిపడింది. గవరపాలెం పార్కు సెంటర్ వద్ద రాజేష్ మృత దేహాన్ని చూసిన స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఇన్‌చార్జ్ డిఎస్పి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ సిఐ భాస్కరరావు దర్యాప్తు ప్రారంభించారు. రాజేష్ మీద గతంలో అనేక పోలీస్ కేసులు ఉన్నాయి. ఒక హత్య కేసులో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఇదిలా ఉండగా నిరంతరం హడావుడిగా ఉండే పార్కు సెంటర్ వద్ద ఈ సంఘటన చోటు చేసుకోవడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. నిందితులను గుర్తించేందుకు గాను క్లూస్, డాగ్ టీమ్‌లను రంగంలోకి దించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# బాలసదన్ నుండి పరారైన విద్యార్థినిలు





అనకాపల్లి : కశింకోట బాలసధన్ బిసి వసతి గృహం నుండి సోమవారం ఉదయం ఇద్దరు చిన్నారులు పరారైనారు. ఈ సంఘటనకు సంబంధించిన సిడిపిఓ పి.దుర్గాలక్ష్మి, అకౌంటెంట్ పి.నాగలక్ష్మిలు అందించిన వివరాలు... కశింకోట బిసి వసతి గృహంలో చీడికాడ మండలం మంగలాపురంకు చెందిన తుమ్మపాల శాంతి కుమార్తె మౌనిక (8) సంవత్సరాల బాలిక 3వ తరగతి చదువుతోంది. అదే విధంగా అనకాపల్లి రింగ్ రోడ్డులో గల కోనేటి హేమంత్ కుమార్ కుమార్తె హాసిని (10) 4వ తరగతి చదువుతూ వసతి గృహంలో ఉంటున్నారు. ఈ పిల్లలు ఇద్దరు 2019 విద్యా సంవత్సరంలోనే ఇక్కడ జాయిన్ అయ్యారు. సోమవారం ఉదయం వీరి ఇరువురికి రాత్రి విధులు నిర్వహించిన వసతి గృహం సేవిక కనకం, హౌస్ కీపర్ మనిలు స్నానాలు చేయించారనే అన్నారు.

అనంతరం విద్యార్థినులకు అందించే గ్రుడ్లు రెండు మిగిలి పోయాయని అవి ఎవరివి అని చూసుకుంటే వీళ్ల ఇద్దరు గురించి తెలిసిందన్నారు. వాళ్లు కనిపించే లేదని వెతకడం మొదలు పెట్టామన్నారు. మౌనిక తల్లి శాంతి నిన్నటి వరకు నాతోనే ఉన్న పిల్లను హాస్టల్‌కు తీసుకువచ్చి వదిలేనని చాలా చోట్ల వెదికాము కనపడలేదని ఆమె రోధిస్తున్న తీరు అందరినీ కలచి వేసింది. విషయాన్ని పోలీసులకు తెలిపి ఫిర్యాదు ఇచ్చామని సూపరింటెండెంట్ దుర్గా వరలక్ష్మి అన్నారు.

## సింహగిరి ఘాట్ రోడ్డులో కారు బోల్తా భక్తులు సురక్షితం



సింహాచలం : సింహగిరి నూతన ఘాట్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం కారు బోల్తా పడి నలుగురు గాయపడ్డారు గాజువాక చెందిన భక్తులు కారులో అప్పన్న దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా కొత్త రోడ్డు మొదటి మలుపు వద్ద రైలింగ్ తగిలి కారు బోల్తా పడింది ఈ ప్రమాదంలో భక్తులకు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు వారి ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్ ద్వారా నగరంలోని ఆస్పత్రికి తరలించారు.

## డివిజన్లో 5 బాణాసంచా తయారీ యూనిట్లు సీజ్

### బాణాసంచా విక్రయ కేంద్రాల వద్ద ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి : ఆర్డీవో ఎస్.మల్లిబాబు



పెద్దాపురం : డివిజన్లో ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్న 5 బాణాసంచా తయారీ యూనిట్లను సీజ్ చేయడం జరిగిందని ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు.సోమవారం ఆర్డీఓ ఛాంబర్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనలు మేరకు డివిజన్లో బాణాసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేయగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన 5 తయారీ యూనిట్లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ యూనిట్ల లైసెన్సుల రద్దుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరూ ఆనందంగా పండుగ జరుపుకోవడానికి జిల్లా కలెక్టర్ బాణాసంచా విక్రయ కేంద్రాల నిర్వాహకులకు పలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.డివిజన్లో 12 మండలాలు,3మున్సిపాలిటీ లలోను సంబంధిత ఎస్సై,అగ్నిమాపక అధికారి, తహశీల్దార్ లు ఊరికి దూరంగా నిర్దేశించిన ప్రదేశాల్లోనే ఆర్డీవో అనుమతి ఇచ్చిన విక్రయ కేంద్రాల నిర్వాహకులు కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.ఆర్డీవో అనుమతి పొందినప్పటికీ 125 డెసిబల్స్ కు మించిన పేలుడు పదార్థాలు , టపాసులు , బాంబులు గానీ అమ్మడానికి లేదని తెలిపారు.అమ్మకాలు కొనసాగించడానికి టెంట్లు వేసి క్లాత్ లు కట్టి మంచాల మీద బాణా సంచా సామగ్రిని అమ్మకూడదని తెలిపారు.కచ్చితంగా రేకులతో కూడిన షాపుల ఏర్పాటు విక్రయదారులదే బాధ్యతయని తెలిపారు. అదేవిధంగా షాపులన్నీ వరుస క్రమంలో లేకుండా షాపుల మధ్య మూడు మీటర్ల దూరం కచ్చితంగా పాటించాలని, అలాగే ప్రమాద నివారణకు అవసరమైన ఇసుక బకెట్లు,నీళ్లు,ఖాళీ డ్రమ్ములు ఏర్పాటు చేసుకునే బాధ్యత బాణాసంచా విక్రయ నిర్వాహకులదేనని అన్నారు.నిబంధనలను ఉల్లంఘించి న వారిని ఉపేక్షించేది లేదని,వారి అనుమతిని రద్దు చేసి సామాన్లు సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని,పండుగ బాధతో కాకుండా సంతోషంతో ముగించుకోవాలని ఆర్డీవో కోరారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను Minimum 7 days క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు

**సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అలవరచుకోండి**

**పతంజలి యోగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనకాపల్లి ఎం.పి, భీశెట్టి వెంకట సత్యవతి**

**యోగా కేంద్రం ఏర్పాటుకు కృషి-చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ**



ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని సత్కరిస్తున్న చోడవరం పతంజలి యోగా కేంద్రం నిర్వాహకులు

చోడవరం : మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక వికాసానికి, ఆధ్యాత్మిక చింతనకు యోగా ఎంతో దోహదపడుతుందని, దీనికి ప్రతి ఒక్కరు తమ దినచర్యలో భాగంగా యోగా అలవరచుకోవాలని అనకాపల్లి ఎం.పి, డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. చోడవరం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో స్థానిక పతంజలి యోగా కేంద్రం నిర్వాహకులు పుల్లేటి సతీష్, పతంజలి యోగా ట్రస్ట్ ఛైర్మన్ పప్పల రమణ మూర్తి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా ఎం.పి సత్యవతి, విష్ణుమూర్తి దంపతులుతో పాటు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి, ఎస్.ఐ, లక్ష్మీనారాయణ పాల్గొని యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.పి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జీవన విధానంలో మార్పుల వలన ప్రతి ఒక్కరు వారివారి స్థాయిలలో ఏదో ఒక ఒత్తిడికి గురై మానసిక ఆందోళనలు, అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. రోజూ యోగా చేయడం వలన వాటిని అధిగ మించడంతో పాటు ఆరోగ్యం,




యోగా పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎం.పి, డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి

ఆనందం సాధించవచ్చని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరంలో యోగా కేంద్రం నిర్వహించి, గ్రామీణ ప్రాంతం వారిని ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ యోగాను విశ్వవ్యాప్తం చేశారని, ప్రపంచ దేశాలు యోగా ఆవశ్యకత గుర్తించారన్నారు. చోడవరంలో యోగా కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు పుల్లేటి సతీష్‌ను అభినందించారు. చోడవరం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చేలా తన శిష్యులను తయారు చేయాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఫారెస్ట్ అధికారి రామ్ నరేష్, ఎస్.ఐ, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగులు తమ ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా సాధన చేయాలన్నారు. అనంతరం ఎం.పి, ఎమ్మెల్యే చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి అశోక్, పసుమర్తి నానాజీ, రిటైర్డు ఎమ్మార్వో రామ చంద్రరావు, టీచర్ రేపాక రమేష్, కె.వెంకటరావు, ఈశ్వరరావు, నరేష్, యోగా పోటీల న్యాయ నిర్ణేతలు ఎ.శంకర్‌రావు, బి.రామారావు, బి.గణేష్, బి.నగేష్, వి.రామారావు, జనార్ధన్,పైడిరాజు, జిల్లాలోని 30 యోగా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కె.జి.బి.వి, గురుకుల పాఠశాలలకు చెందిన నాలుగు వందల మంది యోగా అభ్యసకులు పాల్గొన్నారు.

# కరాటేతో ఆత్మరక్షణ

విశాఖపట్నం: కరాటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగమని కెజిహెచ్ సూపరింటెండెంట్ జి.అర్జున అన్నారు. బుల్లయ్య కళాశాల సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలు తగరపు వలస, యలమంచిలి, పశ్చిమ గోదావరి తదితర ప్రాంతాల నుండి 16 సం॥లలోపు స్కూల్ విద్యార్థులు 150మంది పాల్గొన్నారు. రానున్న స్కూల్ గేవమ్స్ ఫెడరేషన్, ఇంటర్నేషనల్ కరాటే పోటీలలో ఎంపికైన వారికి పంపడానికి అర్హులని నిర్వాహకులు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సంపత్ విద్యానికేతన్, డేర్ అండ్ విత్ ఇనిస్టిట్యూట్‌ల నుంచి చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ విద్యాపరిషత్ డైరెక్టర్ గిరి కోటేశ్వరరావు, ఎస్.వి.రమణ కరాటే మాస్టర్ పరదేశ్ జి.శివరామకృష్ణ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కె.యూషన్, పరదేశ, సిహెచ్.సంతోష్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా
# విద్యార్థులకు గాయాలు



భీమునిపట్నం: ఐ.ఎన్.ఎస్. కళింగ కేంద్రీయ విద్యాలయంనకు చెందిన పిల్లలను తీసుకు వస్తున్న ఆటో బోల్తా పడడంతో ఆరు గురు విద్యార్థులు గాయాల పాలయ్యారు. సోమవారం కళింగ స్కూల్ అనంతరం 14 మంది స్కూల్ విద్యార్థులను తీసుకుని ఆటో భీమిలీ కి బయలు దేరింది ఎర్రమట్టి దిబ్బలు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది అదే సమయంలో విశాఖ నుండి భీమిలి కి వస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ప్రతిష్ట ఆగి గాయ పడ్డ ఆరుగురు పిల్లలు సాకేత , దర్శిత, యోగేష్, అనూష, శశి వర్ధన్, సాయి ఉజ్వల్ లను తన వాహనములో భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది. ఆరుగురకు గాయలుకాగా ఆసుపత్రి సిబ్బంది, సూపరింటెండెంట్ సిద్దార్ధ్ పర్యవేక్షణలో ప్రధమ చికిత్స అందించారు. ఇద్దరు పిల్లలకు కాళ్లకు గట్టి దెబ్బలు తగలడంతో అనూష, దషిత లను కె.జి.హెచ్ కు రిఫర్ చేశారు.ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ప్రతిష్ట, ఎం.ఆర్ .ఓ వెంకట ఈశ్వరరావు స్కూల్ ప్రిన్సిపాల్ ఆసుపత్రికి వచ్చి గాయపడ్డ పిల్లలను పరామర్శించారు. ప్రమాదంలో పిల్లలకు ప్రాణాపాయం జరగకుండా గాయాలతో బయటపడ్డారు.

# స్కూల్ పిల్లలకి ఐడి కార్డ్స్ పంపిణీ

భీమునిపట్నం: చిట్టివలస జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి .హెచ్ .రోజా రమణి అభ్యర్ధన మేరకు వారి స్కూల్ పిల్లలకి ఐడి కార్డ్స్ పిల్లలందరికీ కావాలని వుయ్ కేర్ యు వారికి విషయము చెప్పగా వెంటనే ఆ సంస్థ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి స్పందిస్తు తగరపువలస వాస్తవ్యులు శ్రీ మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ అధినేత ఆదిమూలం నాగరాజు, సత్య నారాయణల ఆర్థిక సహాయంతో వారికి సోమవారం స్కూల్ పిల్లలందరికీ ఐడి కార్డ్స్ అందజేసారు. వారు స్పందిస్తూ మరల తగరపు వలస లో గల చిట్టివలస బాయ్స్ హై స్కూల్ మరియు సంతపేట లో గల అంబేద్కర్ హైస్కూల్ విద్యార్థులకు కూడా త్వరలో ఐడి కార్డ్స్ అందజేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు కావున ఇటువంటి కార్యక్రమాల్లో సహాయ సహకారాలు అందిస్తున్న వారికి ప్రధానోపాధ్యాయులు మరియు వి కేర్ యు మరియు హెల్పింగ్ హాండ్స్ తరుపున ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆదర్శ్ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో
# పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

భీమునిపట్నం : పోలీస్ అమరవీరుల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం భీమిలి ఆదర్శ్ హిందీ ప్రేమీ మండలి ఛైర్మన్ కె.ఎస్.ఆర్. క ృష్ణారావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు - సమాజంలో వారియొక్క పాత్రమీద తెలుగు హిందీ మాధ్యమాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాస రచన పోటీల విజేతలకు తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ అధ్యక్షులు, ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు , ప్రొఫెసర్ జి.ఎల్.ఎన్. రాజు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ. పోలీస్ లు వారియొక్క జీవితాలను పణంగా పెట్టి దేశ సేవలో నిమగ్నమై ఉంటారని, కుటుంబాన్ని కూడా పక్కన పెట్టి ప్రజాసేవకే జీవి తాన్ని అంకితం చేస్తారని ఇలాంటి అమర వీరుల కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గంటా నూకరాజు ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, శ్రీను, రఘు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అమరవీరుల వారోత్సవాలలో భాగంగా
# విద్యార్థులకు వివిధ పోటీలు

భీమునిపట్నం: పోలీసుల అమర వీరుల వారోత్సవాలలో భాగంగా భీమిలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ స్కూల్ లో విద్యార్థులకు ఎస్సై, కార్టూన్, డ్రాయింగ్, పోటీలు నిర్వహించినట్లు ఎస్.ఐ రాంబాబు తెలిపారు. సిటీలో నిర్వహించిన ఈ పోటీలలో భీమిలి ప్రభుత్వ హైస్కూల్ కు చెందిన బి.అనిత (ఎస్సై రైటింగ్) లో, టి. ఈశ్వర్రావు( కార్టూన్) ప్రధమబహుమతి పొందినట్లు తెలిపారు. వీరిద్దరికి సి.పి చేతుల మీదుగా బహుమతులు అందజేశారనీ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు,సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# సమత ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు




విశాఖపట్నం : విజిలెన్స్ వీక్ సంద ర్భంగా సమత ఎన్ఎస్-ఎస్‌యూనిట్స్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ భానుప్రకాష్ చీఫ్ మేనేజర్ విజిలెన్స్ డిపార్ట్మెంట్ హెచ్పిసిఎల్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన సందర్భంగా విజిలెన్స్ వీక్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మరియు వివిధ సంస్థలలో జరుగుతున్న టువంటి అన్యా యాలను అక్రమాలను వెలికితీసి సంబంధించిన విజిలెన్స్ డిపార్ట్మెంట్ వారికి అందజేయడంలో విద్యార్థుల పాత్ర కీలకమైందని తెలియజేశారు. ఇందులో ముఖ్యంగా రేషన్ డిపోలు, పెట్రోల్ బంకులు మొదలగు సంస్థలలో అధికంగా ఉంటుందని, వాటిని నిర్మించడంలో సమంతా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముఖ్య పాత్ర పోషించారని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో...

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయ రవీంద్ర, డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస రావు ఎన్ఎస్ఎస్ పిఓ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ బి.రాజేష్ కుమార్, ఎంబీఏ హెచ్ఓడిజి రమేష్, ప్లేస్మెంట్ ఆఫీసర్ మైకేల్, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఇసుక సరఫరా చేయాలి

**సిఐటియూ ఆధ్వర్యంలో ధర్నా**



మంత్రి ముత్తంశెట్టికి వినతిపత్రం సమర్పించిన సీఐటియూ నాయకులు

భీమునిపట్నం: ప్రభుత్వం ఇసుక సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ. కార్మికుల బ్రతుకు లతో ఆటలాడు కుంటుందని భవన నిర్మాణ కార్మికులు భీమిలి లోని మంత్రి ముత్తంశెట్టి. శ్రీనివాస రావు క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికులు ఇసుక సరఫరా చేయాలంటూ మంత్రికి వినతి పత్రం అందించారు. అంతకుముందు భీమిలి చిన్న బజారు నుంచి పెద్ద బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇసుక సరఫరా లేకపోవడంతో దీని పై ఆధారపడ్డ వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తాపీ మేస్త్రి లే కాకుండా ప్లంబర్లు, ఎలక్ట్రిషన్ లు, కార్పెంటర్లు, టైల్స్ వర్కర్లు కొన్ని వేలమంది ఉపాధిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేసారు. దీనిపై తక్షణమే దృష్టిసారించి ఇసుకను అందుబాటులో కి తెచ్చి కార్మికు లను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటి యు నాయుకులు రవ్వ నరసింగ రావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రకటించిన పది వేల రూపాయల వేతనం జీవో విడుదల చేయాలి

**- పెంచిన వేతనాల చెల్లించాలని- కదంతొక్కిన విఓఏలు - సిఐటియు ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన**



దేవరాపల్లి : ప్రభుత్వం ప్రకటించిన పది వేల రూపాయల వేతనం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండల వెలుగు విఓఏ లు మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల సిఐటియు కార్య దర్శి సిహెచ్.రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన విధంగా పదివేల వేతనాన్ని వెంటనే చెల్లిం చాలన్నారు. విఓఏల పై రాజ కీయ వేధింపులు, తొలిగింపులను ఆపాలని కోరారు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సుమారు 200 మంది విఓఏ ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ జె. రమేష్ బాబు కు ఎంపీడీవో సిహెచ్. సుబ్బ లక్ష్మికు వినతి పత్రం ఈ కార్యక్రమంలో సంఘ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కే.సూరి బాబు, జి.రాము, ఎం. రాంపురి, కే.అప్పా రావు, వరలక్ష్మి, తాడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## అరకు నియోజకవర్గం లో
# భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను

**బీజేపీ నాయకులుపాగిరాజారావు**



అనంతగిరి : మండల కేంద్రం అనంతగిరిలో సోమవారం భారతీయ జనతా పార్టీ నాయకులు పాగి రాజారావు ముఖ్య అతిథిగా విచ్చేసి బిజెపి పార్టీ బలోపేతంపై పార్టీ కార్యకర్తలతో చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మోడీ ప్రధానమంత్రి గిరిజనుల గురించి ఎన్నో అవకాశాలు స ృష్టిస్తున్నారని రైతులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆరువేల రూపాయలు ఇస్తున్నారని అలాగే రహదారులకు వేయిం చడం జరుగుతుందని గిరిజనులను అన్ని విధాల ఆదుకుం టుందని మోడీ గారు నాయకత్వాన్ని మనమంతా బలపరిచారు నిజం ఆయన కోరారు అనంతగిరి మండలంలో స్థానిక సంస్థలకు బిజెపి కార్యకర్తలు సమాయ త్తం కావాలని మనందరము కష్టపడి పనిచేసి అనంతగిరి లో బిజెపి జెండా ఎగురవేయాలి అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగం పరిశ్రమల స్థాపనపై అవగాహన




విశాఖపట్నం : ప్రపంచ పర్యావరణానికి పెను సవాలుగా మారిన ప్లాస్టిక్‌ను తరిమి కొట్టాలని, వేస్టేజి ప్లాస్టిక్ రీ సైక్లింగ్ చేసి వస్తువుగా మలిచే పరిశ్రమలకు ప్రభుత్వాలు సహకరించాలని వాసవీ చైతన్య ఫౌండేషన్ అధ్యక్షురాలు పాలూరు శేషమాంబ అన్నారు. వాసవి చైతన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక హోటల్ ప్లాస్టిక్ వినియోగం, పరిశ్రమలకు పై ప్రభు త్వాలు ప్రోత్సాహకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా డీన్ చండూరి కె.ఎస్.రాజు, ఎఎన్.సాహం దాస్ హాజ రయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ విశాఖకు సంబంధించి రాజు అనే పారిశ్రామికవేత్తకు టైల్స్ టెక్నాలజీ విభాగాన్ని కేటాయించారు. ఈ కార్యక్రమానికి కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ కందుల నాగరాజు, ప్రవీణ్, బంగారుశెట్టి, జె.వి. ప్రభాకర్, కృష్ణ ప్రసాద్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ అధికార ప్రతినిధిగా ఎన్నికైన
# ఎమ్మెల్యే అధీప్‌రాజ్‌కు ఘన స్వాగతం

సబ్బవరం : రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధిగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడంతో నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం సబ్బవరం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఎమ్మెల్యే అధీప్‌రాజ్‌ను ఆ పార్టీనేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌ఛార్జ్ ముమ్మన దేముడు, ఎస్ నారాయణమూర్తి, సముద్రం, కొటాన రాము, కర్రి బాబు, గొర్లి ఉమామహేశ్వరరావు, సాలాపు వెంకటేశ్వరరావు, గవర శ్రీనువాసరావు, ఎస్.ముత్యాలనాయుడు, పాలిశెట్టి సురేష్, ధనిమిరెడ్డి శ్రీను, కాపుశెట్టి శ్రీను, టి.శేఖర్, బలిరెడ్డి కనకరాజు, దాసరి నర్శింహులు, పిహెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్‌లు పాల్గొన్నారు.

# ఇసుక అయినా ఇవ్వండి, కరువు భత్యమైనా కల్పించండి

## చోడవరం కార్మిక సహాయ కార్యాలయంలో భవణ నిర్మాణ కార్మికుల వినతి

చోడవరం : నెలల తరబడి పనులు లేక భవణ నిర్మాణ కార్మికులు వీధిన పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం భవణ నిర్మాణాలు జరిగేలా ఇసుక కొరతనైనా తీర్చాలని లేదంటే కరుభత్యాలైనా ఇప్పించాలంటూ చోడవరం భవణ నిర్మాణ కార్మికుల డివిజన్ కార్యదర్శి కొసర తాతారావు ప్రభుత్వాన్ని కోరారు. చోడవరం కార్మిక సహాయ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులతో కలసి నిరసన చేపట్టారు. నెలల తరబడి ఇసుక కొరతతో భవణ నిర్మాణాలు జరగక భవణ నిర్మాణాలపై ఆధారపడిన కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వాన్ని సమస్య పరిష్కరించాలని కోరిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికులను



కార్మిక సహాయ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందిస్తున్న చోడవరం భవణ నిర్మాణ కార్మికులు

చిన్నచూపు చూడటం తగదని, వెంటనే భవణ నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు ఇసుక అందుబాటులోకి తేవాలని, లేని పక్షంలో కరువు భత్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.నాగభూషణం, బాలిబోయిన దేముళ్ళు, చాకిపల్లి సంఘం రామ్ మోహన్‌రావు, సిటిజన్ కోలనీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

కొయ్యూరు : మండలంలో పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను కొయ్యూరు ఎస్. ఐ. రెడ్డి అసిరి తాత, మంప ఎస్.ఐ సన్నిబాబుల ఆధ్వ ర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిఏహెచ్ స్కూల్, బాయ్స్ వన్ స్కూల్, కెజిబివి స్కూల్, రాజేంద్రపాలెంలో గర్ల్స్ స్కూల్ విద్యార్థులు, సుమారు 15వందల మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేసు కుంటూ కొయ్యూరు నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. కొయ్యూరు




ఎస్సై రెడ్డి సిరి తాత, మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు లకు, ముందుగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అను నిత్యం ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అండగా అ ఉంటా రన్నారు. సంఘ విద్రోహ చర్యలకు వైపు, చూడకుండా, మంచి మార్గంలో. నడవాలని ఆయన కోరారు. మంప ఎస్ఐ సన్ని బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యా రంగం వైపు పయనించాలని అన్నారు. మంచి ఉద్యోగాలు సంపాదించి ఊరికి, దేశం కు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ఆదివారం నాడు కొయ్యూరు, మంప ఎస్ఐలు పలుచోట్ల బాయ్స్ వన్ ,ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి, 3k రన్ నిర్వ హించారు. రన్ కేవలం శారీరక దృఢత్వం కోసం మాత్రమే కాదని, ఇటు వంటి కార్యక్రమాల వల్ల సామాజిక స్పృహ ఏర్పడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పిడి అంబటి నూకరాజు, పిఈటి గోపాల్‌తో పాటు ఏపీఎస్పి పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

# రోడ్లు బాగు చేసి... లారీలు తిప్పండి

-క్వారీ లారీ యజమానులకు ప్రభుత్వ విప్ హెచ్చరిక

-ఆనందపురం వద్ద భారీ లారీలు అడ్డగింత - రోడ్లు పూడ్చితామని హామీతో ఆందోళన విరమణ



దేవరాపల్లి : వేపాడ మండలం వావిలపాడు వద్ద ఉన్న స్టోన్ క్రషర్ భారీ వాహనాలు(లారీలు) రాకపోకలు వలన దేవరాపల్లి ఆనందపురం రోడ్డు చిందరవందరగా మారిందని మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు అన్నారు. కే కోటపాడు మండలం ఆనందపురం జంక్షన్ వద్ద ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బూడి స్థానిక ప్రజలతో అధికంగా తిరుగుతున్న భారీ లారీలను అడ్డగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతుకుల మయంగా తయారైన రోడ్డును పూడ్చితేనే ఈ రోడ్డు కుండ లారీలను తిరగనిస్తామని లేదంటే యజమానులు ఆపుకోవాలని ఆయన హెచ్చరించడంతో స్టోన్ క్రషర్ లారీ యజమానులు దిగివచ్చారు. మూడు రోజుల్లో గతుకులను పూడిస్తామని మాట ఇవ్వడంతో ఆయన ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు. లారీ యజమానులు గతుకులు పూడ్చిన తరువాత ప్రభుత్వం మంజూరు చేసిన 23 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు చేపడతామని ఆర్ అండ్ బి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆనందపురం సమీపంలోని భారీ గోతుకలో నిండి ఉన్న నీటిని తొలగించి తాత్కాలికంగా గోతులను ప్రొక్లయిన్‌తో శుభ్రపరచారు.

ఆ పనులు పూర్తి అయ్యేంత వరకు ఆయన అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రెడ్డి జగన్మోహన్, వైఎస్ఆర్ సీపీ మండల యువజన విభాగం నాయ కులు బూరె బాబురావు, వంటకు అప్పాజీ, దాసరి గోపి, చలు మురి చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగు యానిమేటర్స్ ఉద్యోగం భద్రత కలిగించాలి

## పెంచిన జీతాలు వెంటనే చెల్లించాలి : సిఐటియు నాయకులు

అనంతగిరి : మండల కేంద్రం అనంతగిరిలో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో వెలుగు యానిమేటర్స్ నకు పెంచిన జీతాలు 10,000,పదివేలరుపాయలు వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు తొలగింపులుఆపాలని హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వీ,,ఓ,ఏ లకు రాష్ట్ర ప్రభుత్వం 10,000పదివేలు వేతనం ప్రకటన చేసి 4నెలలు దాటింది కాని నేటికి జీవో విడుదల చేయాలని కోరుతున్నాము వేతనం పెంచుతూ ప్రకటన చేయాలని కోరుతున్నాము వేతనం పెంచుతూ ప్రకటన చేసిన నాటి నుండి జిల్లాలో వీఓ ఏలను పెద్దసంఖ్యలో తొలగిస్తున్నారు స్వచ్ఛందంగా వీఓ ఏలను తొలగిపోవాలని వేధింపులకు గురిచేస్తూ బెదిరిస్తున్నారు కనీస ప్రతిపాదక కూడా చూడకుండా నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్నారు కొంతమంది స్థానిక అధికార పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు ప్రస్తుతం పనిచేస్తున్న వారి స్థానంలో వారికి సంబంధించిన వారి వ్యక్తుల లిస్టును ఇచ్చి వీఓ ఏలుగా నియమించమని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు 18 సంవత్సరాలుగా జీతం లేకుండా పని చేసిన వివో ఏలను ఏ కారణం లేకుండా తొలగించడం అన్యాయమని ప్రస్తుతం వేతనం పెరిగిందనే ఆనందంగా కంటే ఉన్న ఉపాధి పోతుంది అనే ఆందోళనలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు కావున తమరు వెంటనే స్పందించి తొలగింపులు ఆ పని ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాము ప్రభుత్వం జూన్ నెలలో ప్రకటించిన పది10,000, వేల రూపాయల వేతనం ప్రభుత్వం చెల్లించాలని పొదుపు సంఘాల పై భారం వేయవద్దని కోరుచున్నాము వేతనము వివోఏ లబ్యాంకు అకౌంట్లకు జమ చేయాలని పని భద్రత కోసం హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుచున్నాము పొదుపు మహిళలకు అనేక రకాలైన సేవలను అందిస్తున్న ఆర్పీ లకు ఉద్యోగ భద్రత కల్పించాలని తగిన గుర్తింపు గౌరవం వేతనం చెల్లించాలని. పెంచిన జీతాలను జీవోను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నామని డిమాండ్ చేయడమైనది అనంతగిరి మండల తహసీల్దార్ వెంకట వరప్రసాద్ కు వినతి పత్రం సమర్పించడం మైనది. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీ దీసరి గంగరాజు అక్కడ వివో ఏలు కే దిలీప్ దిలీప్ కుమార్, హరిక ృష్ణ, ఏం రంజిత్, కుమార్, కే శిరీష, కె,ఈశ్వరరావు కే సుదీర్ పాల్గొన్నారు.

# రూ.2కోట్లతో కంటైనర్ రెస్టారెంట్ ప్రారంభించిన మంత్రి

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అధ్వర్యంలో భీమిలి బీచ్ ఎర్రమట్టి దిబ్బలు యందు రూ. 2 కోట్లతో నిర్మించిన బీచ్ కంటైనర్ రెస్టారెంట్ ను పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పర్యటక ప్రాంతాలను ఈ యొక్క సీజన్లో మౌలిక సదుపాయాలు కలిపించి ఉత్తమ పర్యాటక రాష్ట్రంగా తీర్చి దిద్దటానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అలాగే అల్లూరి సీతారామ రాజు యొక్క ప్రాంతమైన కృష్ణ దేవరాయపేట , పాండ్రంగి



గ్రామాల్లో త్వరలో కార్యక్రమాలకి శంకుస్థాపన జరుగుతుందని అన్నారు. అనంతరం విశాఖపట్నం నుండి నేరుగా తిరుపతి వెంకన్న స్వామి దర్సనం నిమిత్తం ఎ.పి.టి.డి.సి ఆధ్వర్యంలో నూతనంగా ఎ.సి కోచ్, మల్టీ ఆక్స్ ల్ వోల్వో బస్సు ని ప్రారంభించారు. ఈ బస్సు విశాఖపట్నం నుండి ప్రతిరోజు మద్యాహ్నం 2 గంటలకి మొదలై మరుసటి రోజు ఉదయం 5 గంటలకు తిరుపతి కి చేరుకుంటుంది. ఈ బస్సు యొక్క టికెట్ ధరలు పెద్దలకు 4,000 పిల్లలకు 3,700 నిర్ణయించటం జరిగింది. గతంలో ఈ బస్సు విజయవాడ నుండి తిరుపతికి ఉండేది మంత్రి చర్యతో విశాఖపట్నం నుండి తిరుపతికి నేరుగా ప్రయాణ సదుపాయం ఏర్పాటు చెయ్యటం జరిగింది. యాత్రికలు ప్రతీ ఒక్కరు కుడా ఎపిటిడిసి.ఇన్ అనే వెబ్ సైట్ లో ఆన్లైన్ బుకింగ్స్ కలదు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఎం.పి ఎం.వి.వి సత్యనారాయణ , గోపాల్ పూర్ ఎం.ఎల్.ఎ. వెంకట రావు , మాజీ ఎం.ఎల్.ఎ. మల్లా విజయ్ ప్రసాద్, సిటీ పార్టీ ప్రెసిడెంట్ వంశి , ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు భీమిలి నియోజ వర్గ ఇన్ చార్జ్ ముత్తంశెట్టి మహేష్ , నియోజవర్గ నాయకులు పెదబాబు , కోరాడ వెంకటరావు,గాడు వెంకటప్పడు,మణిశంకర్ నాయుడు యలమంచిలి సుర్యనారాయణ, డి కొండబాబు, అమర్, నల్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధికి

## 30కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం : ఎమ్మెల్యే అధీప్‌రాజ్



సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి 30 కోట్ల నిధులు వైసిపి ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే అధీప్‌రాజ్ తెలిపారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రాంటు కింద పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల అభివృద్ధికి 10 కోట్లు, స్వచ్ఛ్ భారత్ కింద 5 కోట్లు, పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న వార్డులకు 1,440 కోట్లు మొత్తం 29.80 ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80% నెరవేర్చిందని, హామీ నెరవేర్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. నాలుగు నెలల్లోనే హామీలు అమలు చేసారన్నారు. నాలుగు లక్షల ఉద్యోగాలు, గ్రామ వాలంటీర్లు సచివాలయ ఉద్యోగాలు, రైతు భరోసా, ఆటో కార్మికులకు 10 వేల రూపాయలు అగ్రిగోల్డు బాధితులకు 250 కోట్లు నిధులు మంజూరు చేసారన్నారు. టిడిపి వారు లేని పోని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. 30 పడకలతో ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సమీకరించి ఆసుపత్రి చుట్టూ ప్రహారీ నిర్మిస్తామన్నారు. ఖాళీ స్థలంలో పచ్చదనం పెంపొందిస్తామన్నారు. ఆసుపత్రి ఆవరణలో శిథిల భవనా లను తొలగింపునకు ప్రభుత్వం లక్ష రూపాయలు మంజూరు చేసింద న్నారు. త్వరలోనే భవనాలను కూల్చి వేసి చెట్లు గ్రీనరీ పెంచుతా మన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, తుంపాల అప్పారావు, గొర్లె ఉమామహేశ్వరరావు, ఎస్.ముత్యాలనాయుడు, సాలాపు వెంకటేశ్వరరావు, ధనిమిరెడ్డి శ్రీను, గవర శ్రీను, కర్రి బాబు, మండల సముద్రం, సబ్బవరపు సత్యనారాయణ, కాపుశెట్టి శేషు, శరగడం రాము, శరగడం ధనలక్ష్మి, కె.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

**పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటవురట్ల మండల కేంద్రంలో పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో భారీ ర్యాలీ, మానవహారాన్ని ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. ఎస్సై సురేష్ కార్యక్రమాన్ని నిర్వహించడంలో సఫలీకృతులయ్యారు. విజయ భాను ప్రతినిధికి విషయాన్ని తెలియజేశారు.**



# సచివాలయాలం ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



అనకాపల్లి : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం ముందడగు వేస్తుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాధ్ అన్నారు. మండలంలో గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి, గ్రామాలలో సచివాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్బంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలు 72 గంటలలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందడగు వేసిందన్నారు. అలాగే నియోజకవర్గం అభివృద్దికి అధిక నిధులు కేటాయిస్తామన్నారు. గ్రామ పంచాయితీ 15 లక్షల రూపాయిలు మంజూరు చేసామని అదనపు గదులు నిర్మాణం చేపడతా మన్నారు. ఈ గ్రామం నుండి పరవాడ నియోజక వర్గంలో గల పెద ముషిడివాడ వరకు త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. గోపాలపురం గ్రామం అభివృద్ది పనులు చేపడతామని సామాజిక భవనానికి 5 లక్షలు మంజూరయ్యాయని త్వరలో పని ప్రారంభిస్తామన్నారు. జనవరి 26 నుండి అమ్మవడి కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మిస్తామన్నారు. అగ్రిగోల్డ్ బాదితులకు పదివేల రూపాయిల లోపు ఉన్న ప్రతీ ఒక్కరికి చెల్లింపు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 256 కోట్లు మంజూరు చేసిందన్నారు. మండల వైఎస్ఆర్‌పార్టీ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్టఅట కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్లబుల్లిబాబు, డాక్టర్ విష్ణుమూర్తి, గొల్లవిల్లి శ్రీనివాస్, దంతులూరి శ్రీధర్‌రాజు, భీశెట్టి జగన్, పిడీ గాంధి, బొబ్బరి శ్రీనివాసరావు, సేనపతి శ్రీను, కొనుమర్ల గోవింద్, ఎంపీడీవో పి. ఉమామహేశ్వరరావు, ఈవో ఆర్డీ ఆంజనేయులు పంచాయితీ రాజ్ డిఈ వెంకట్ అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలీసుల అమర వీరుల దినోత్సవాన్ని పురష్కరించుకొని బారీ ర్యాలీ

- ర్యాలీలో పాల్గొన్న ఎస్సై మురళీమోహన్, ఏఎస్సై శంకర్రావు

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక పోలీసు స్టేషన్ నందు పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నవరం ఎస్సై మురళీమోహన్ ఆధ్వర్యంలో సోమవారం స్టేషన్ సిబ్బంది మరియు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి బారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మురళీ మోహన్ మాట్లాడుతూ



సమాజం కోసం దేశం కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీర జవానుల ఆత్మకు శాంతి చేకూరాలని వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.అదేవిధంగా సమాజంలో పోలీసుల పాత్ర ఎప్పటికీ మరువలేనిది అని, సమాజంలో జవానులు ప్రాణాలను పణంగా పెట్టి శాంతిభద్రతల కోసం సమాజ శాంతి కోసం ఆనాడు వీర జవాన్లు ప్రాణాలు అర్పించటం జరిగిందని దాన్ని స్మరించుకుంటూ అక్టోబర్ 21 వ తారీఖున అమరవీరుల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని ఎస్సై మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్ నందు మానవహారం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్సై శంకర్రావు,ఏ ఎస్సై వీరబ్బాయి మరియు పోలీసు సిబ్బంది,స్థానిక జిల్లా పరిషత్ స్కూలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మార్టూరులో క్వారీ లారీలతో ఇబ్బందులు



అనకాపల్లి : మార్టూరు గ్రామ రహదారిపై ఇష్టాను సారంగా లారీలు నిలవపడం వలన వాహనాల రాకపోలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆ గ్రామ మాజీ వార్డు సభ్యులు కొల్లి అప్పారావు ఈఓఆర్డీ ఆంజనేయులకు ఫిర్యాదు చేసారు. ఈమేరకు వెంటనే స్పందించి లారీలు నిలపకుండా క్వారీ యాజమాన్యాలకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. అలాగే గ్రామంలో అపారిశుద్య పరిస్తితి కారణంగా దోమల బెడద విపరీతంగా పెరిగి పోయిందని తెలిపారు. రహదారుల ప్రక్కన కలుపు వీపరీతంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణ చర్యలు తీసుకోవాలని లేకుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

## పాడిరైతు కుటుంబానికి భీమా నగదు పంపిణి

### మేనేజర్ కూండ్రపు శేషు



అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీకి పాలుపోసే పాడిరైతులకు డెయిరి ఉచిత బీమా అందిస్తుందని డెయిరి మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు.

మండలంలో జంగులూరు గ్రామానికి చెందిన హెరిటేజ్ పాడిరైతు డి సూరిబాబు మృతి చెందాడు .సోమవారం మృతుని భార్య రాజుకు రూ . 25000 ల భీమా నగదను మేనేజర్ కూండ్రపు శేషు పంపిణి చేశారు .ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతుల కుటుంబాలకు హెరిటేజ్ డెయిరీ అండగా ఉంటుందన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలం నాగేశ్వరరావు , ఎల్ అప్పలరాజు , ఎల్ శ్రీను తదితర రైతులు ఉన్నా రు.

## పోలీసు అమరులను స్మరించుకోవాలి



కోటవురట్ల: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని కోటవురట్ల ఎస్సై సురేష్ అన్నారు.

సోమవారం పోలీసు అమరవీరుల దినం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి ప్రధాన కూడలి వరకు విద్యార్థులు, పోలీసులు భారీ ర్యాలీ నిర&ఆవహించారు.

అనంతరం కోటవురట్ల ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ పోలీసు అమరులను ప్రతీ ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.

## అయోడిన్ ఉప్పు వాడకంతో వ్యాధులు దూరం.:

### డిఎం అండ్ హెవో డా.సత్యసుశీల



కాకినాడ: అయోడిన్ ఉప్పు వాడకం ద్వారా వివిధ రకాల వ్యాధులను దూరం చేయవచ్చునని జిల్లా వైద్య శాఖాధికారిణి డా. సత్యసుశీల పేర్కొన్నారు. అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య శాఖాధికారి కార్యాలయం వద్ద అంగన్వాడీ, విద్యార్థులుతో అవగాహనా ర్యాలీ జరిగింది.ర్యాలీ ప్రారంభించిన ఆమెమాట్లాడుతూ1996నుండి అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం జరుగుతోందని, ప్రస్తుతం 64 శాతం మంది మాత్రమే అయోడిన్ కలిపిన ఉప్పు గృహావసరాలకు వాడుతున్నారన్నారు.ప్రతి కుటుంబం అయోడిన్ ఉప్పు వాడాలని, ముఖ్యంగా గర్భవతులు, చిన్న పిల్లలకు ఇది తప్పనిసరి అన్నారు.పిల్లలకు సరైన మోతాదులో అయోడిన్ లేకపోతే శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. ర్యాలీ శాంతిభవన్ వరకూ జరుగగా ఈకార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, కె.జగదీశ్వరీ రాణి, సూపర్వైజర్ అరుణశ్రీ, రాజేశ్వరి, దాయామణి, లైలా, ప్రభావతి, సుమారు150 మంది అంగన్వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా పోలీసుల అమరవీరుల వారోత్సవాలు

మండలంలో పోలీసుల అమరవీరుల వారోత్సవాలు భాగంగా ఈరోజు గొలుగొండ ఎస్సై నారాయణ రావు ఆధ్వర్యంలో తాండవ జలాశయం లో మత్స్యకారులకు అవగాహన కలిగే విధంగా జలాశయంలో వారోత్సవాలు నిర్వహించారు తాండవ రిజర్వాయర్ లో ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే రక్షించేందుకు అవసరమైన మేరకు ఎస్సై నారాయణరావుగారు అమ్మపేట గ్రామస్తులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో అమ్మపేట గ్రామస్తులు పాల్గొన్నారు.



31 వార్డు రైల్వే న్యూకోలని వార్డు ఆఫీస్ మరియు 32 వార్డు శ్రీనివాసనగర్ దాడి రమణమూర్తి కల్యాణ మండపంలో సోమవారం జరిగిన వార్డు సభలలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ళు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జి.వి.యం.సి జోన్-4 కమిషనర్ సింహచలం గారు,ఏ. పి.డి చిట్టిబాబు,జి.వి.యం.సి అధికారులు,మాజీ కార్పొరేటర్ బానాల శ్రీను,31వార్డు అధ్యక్షులు షేఖ్ జుబేర్,32 వార్డు అధ్యక్షులు కె.వి.బాబా,అక్తర్,రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

## అన్‌రాక్ దొంగలు పట్టివేత



మాకవరపాలెం: మాకవరపాలెం మండలం అన్‌రాక్ కర్మాగారం వద్ద దొంగతనాలకు పాల్పడినట్లు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మాకవరపాలెం ఎస్సై కరక రాము తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నలుగుర్ని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి పలు వస్తువులు స్వాదీనం చేసుకున్నామన్నారు.

## శ్రీ సత్యదేవుని బహుళ ప్రచారం నిమిత్తం ప్రచార రధం ప్రారంభం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం హిందూ దర్మప్రచారం లో భాగం గా ధి 21-10-2019 వ తేదీ నుండి శ్రీ స్వామి వారి ప్రచార రధం బహుళ ప్రచారం నిమిత్తం ఏజెన్సీ గ్రామాలలో ప్రచారం చేయుటకు గాను ఆదివారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు ప్రారంభించారు.

## సచివాలయ కార్యదర్శులు బాధ్యతగా పని చేయండి

### ఎంపిడిఒ సువర్ణరాజు

కోటవురట్ల: నూతనంగా నియమితులైన సచివాలయ కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలని కోటవురట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి సువర్ణరాజు అన్నారు. సోమవారం నూతన కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం కార్యదర్శులు ముందుండా లన్నారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంటెంట్ హనుమంత రావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

విశాఖపట్నం: అగ్రిగోల్డ్ బాధితుల సొమ్ము చెల్లింపు కార్యక్రమంలో భాగంగా 10 వేలలోపు డిపాజిటర్లకు తొలివిడతలో 270కోట్లు మంజూరు చేసినందుకు సోమవారం సాయంత్రం విశాఖ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.యస్.జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు గారు,రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం గారు,పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు నరసింహమూర్తి గారు, రాష్ట్ర, పార్లమెంట్,సిటీ నాయకులు,మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ ఆస్థులు పరిరక్షించండి- కదం తొక్కిన క్రైస్తవులు

### దద్దరిల్లిన కలెక్టరేట్ ...వర్షంలోనూ నినాదాల హోరు

### అన్యాక్రాంతమైన సిబిసిఎన్‌సి ఆస్తులు స్వాధీనం చేయాలి

### శిలువను కూల్చిన వారిని అరెస్టు చేయాలి




కాకినాడ: సిబిసిఎన్‌సి పవిత్ర స్థలంలో గల శిలువ,బాలికల మరుగుదొడ్లు కూల్చివేత,స్థలం కబ్జా, కూల్చివేత,ఆస్థులు స్వాధీనం నిరసిస్తూ కాకినాడ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ మెక్లారిన్ గ్రౌండ్ నుండి కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహిచారు.తెలుగు రాష్ట్రల నుండి విచ్చేసిన క్రైస్తవ నాయకులు,దళిత సంఘాలు,ప్రజా సంఘాలు,సీవైఎఫ్ జాతీయ అధ్యక్షులు మూర్తిరాజు,రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాశిబాలయ్య,ఉభయ గోదావరిజిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు,దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు పెరికే వరప్రసాద్, రక్షణ టివి సిఎండి జక్కుల బెన్‌హర్,జాన్ బెంజి లింగం,మహాసేన అతర్జాతీయ అధ్యక్షులు సరిపల్లి రాజేష్, మిషన్ టుదినేషన్స్ అధ్యక్షులు యెల్చూరి పాపారావు, యెల్చూరిజోషఫ్, బెరాకా బ్లెస్సింగ్ మినిస్ట్రీస్‌జోషఫ్ బెన్ని,ఏనుగుపల్లి కృష్ణ,పిల్లి శివ తదితరులుపాల్గొన్న ర్యాలీలో కలెక్టరేట్‌కు చేరుకొంది.ఈసందర్భంగా ఎమ్మెల్సీఐవి మాట్లాడుతూతూర్పుగోదావరి జిల్లా క్రైస్తవ ఆస్తులు కాకినాడలో చారిత్రాత్మక విద్యాసంస్థగా భాసిల్లుతోన్న సిబిసిఎన్‌సి స్థలం కబ్జా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.ఆంధ్రపదేశ్ ఎడ్యుకేషన్ చట్టం1982 సెక్షన్ 53 ప్రకారం ప్రభుత్వ ఎయిడ్ పొందుతున్న ఏవిద్యా సంస్థ ప్రభుత్వ అనుమతి లేకుండా ఆస్తుల క్రయవిక్రయాలు చెల్లవన్నారు.

దీని ప్రకారం సిబిఎం స్కూల్ స్థలం అమ్మకాలు చెల్లవన్నారు.1990 నుండి సిబిసిఎన్‌సి రెన్యూవల్ లేదని 2017 నవంబర్‌లో జిల్లా రిజిస్టర్ హైకోర్టుకు నివేదించారని,దిబోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఆయుర్వేదిక్ కేసులో సుప్రీంకోర్టు1961 అక్టోబర్ 23న రెన్యూవల్ లేని సంస్థలపై ఎవరికి హక్కులుండవని తీర్పు చెప్పిందని ఈరీత్యా సిబిఎం, సిబిసిఎన్‌సి స్కూల్ స్థలం అమ్మకాలు,కొనుగోలు చెల్లవన్నారు. తక్షణం అమ్మకాలు,కొనుగోలు చేసిన వారందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి క్రైస్తవ మిషనరీలు ఆస్తుల పరిరక్షిస్తామన్న హామీ కాకినాడలో ఉల్లంఘునకు గురైందని,దీనికి భాద్యులైన వారిని,సహకరించిన రాజకీయ నాయకులపైనా,అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం సివైఎఫ్ జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ క్రైస్తవుల మనోబావాలను దెబ్బతీసేవిధంగా శిలువను కూల్చి, పేదవిద్యార్థినుల సంబందించిన మరుగుదొడ్లను కూల్చిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు.దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు పెరికే వరప్రసాద్ మాట్లాడుతూ క్రైస్తవ ఆస్థులు కబ్జాచేసి శిలువను కూల్చి అక్రమ కట్టడాలు నిర్మిస్తూన్నవారికి వత్తాసు పలుకుతూ పోలీసులే కబ్జాదారులకు సహకరించడం దారుణమని, పోలీసు వ్యవస్థ చట్టాలపై అవగాహనకలిగి ఉండాలన్నారు.దీనిపై ముఖ్యమంత్రి , గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు.పేదలకు విద్యావైద్యఆధ్యాత్మిక సేవలు అందుబాలో ఉండాలని క్రైస్తవ మిషనరీలు ఆస్థులు సమాకూరిస్తే వాటిని కొంత మంది స్వార్ధపూరిత ప్రయోజనాలకు తకట్టు పెట్టడం దారుణమాన్నారు. క్రైస్తవ ఆస్దులు (ఆధ్యాత్మిక)అమ్మకం , కొనుగోలు వంటివి చేయరాదని చట్టం ఉన్నా వాటిని పక్కపెట్టి దోచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు ఇటువంటి దోపిడీలకు మహాసేన అట్టు కట్ట వేస్తుందని హెచ్చరించారు. క్రైస్తవుల ఆస్థులను కబ్జా చేసిన వారిని కెంటనే అరెస్టు చేయాలని,కూల్చిన శిలువను, మరుగుదొడ్లను తక్షణం నిర్మించాలని ముక్త కంఠంతో క్రైస్తవ నాయకులు డిమాండ్ చేసారు.సిబిసిఎన్ సి ఆస్తులు,విద్యా సంస్థల రక్షణ కోసం ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలనిఆర్పీఎఫ్ రాష్ట్రీయ పరిషత్ అధ్యక్షులు కాశిబాలయ్య కోరారు.పార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ ఐనాపురపు సూర్యనారాయణ,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రాజశేఖర్,సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పెద్దింశెట్టి రామకృష్ణారావు,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.రాజా,నగర కార్యదర్శి గంగ సూరిబాబు,ఆర్పీఐ నాయకులు పిట్టా వరప్రసాద్, వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు, మెక్లారిన్ స్కూల్ నుండి భారీ ప్రదర్శన ప్రారంభమయ్యి పూలే సెంటర్,జీజీహెచ్ మీదుగా జిల్లా పరిషత్‌కు చేరుకుని అక్కడ మానవహారం నిర్వహించారు.

అనంతరం ఇంద్రపాలెం లాకుల వరకు ప్రదర్శన సాగి అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ ఐవి తదితరుల నాయకులు పూలమాలలు వేసి కలక్టరేట్ కు చేరుకుని భారీ ధర్నా నిర్వహించారు. మహిళలు భారీగా తరలివచ్చారు. సిబిఎం స్కూల్ పూర్వ విద్యార్థినిలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దళిత సంఘాల నాయకులు సబ్ కలక్టర్ కలిసి ధర్నా వద్దకు రావాలని కోరగా డిఆర్వోను పంపారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని డిఆర్వో హామీ ఇచ్చారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గంటలు తరబడి సాగిన పోరాటానికి కాకినాడ పౌర సమాజం సానుకూలంగా స్పందించి మద్దతు ఇవ్వడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఇంద్రపాలెం వంతెన వద్ద జరిగిన రాస్తారోకో కు ప్రజలు సహకరించారు.ఎంతో ఉదాత్తమైన ఆలోచనతో ఏర్పడిన మిషనరీ ఆస్తుల రక్షణకు ఉద్యమించిన క్రైస్తవ సంఘాలకు,ప్రజా సంఘాలకు,సహకరించిన ప్రజలకు క్రైస్తవ సంఘనాయకుల కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్టీ రైతులకు రైతు భరోసా ఇవ్వాలి

### గొలుగొండ మండలం వైఎస్ఆర్సిపి నాయకులు సుర్ల గిరిబాబు

గొలుగొండ: ఎస్టీ రైతులకు రిజర్వ్ ఫారెస్ట్ పోడు భూములకు పట్టాలు ఇచ్చారు .వారందరికీ వైయస్సార్ భరోసా పథకం కింద రైతులకు ఇప్పటి వరకు ఏ విధమైన డబ్బు సాయం అందలేదు అని వైఎస్సార్ సీపీ నాయకులు సుర్ల గిరిబాబు , కసిరెడ్డి సత్తిబాబు అన్నారు. సోమవారం బాధిత రైతులతో కలిసి స్పందన కార్యక్రమంలో లో మండల తాసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చారు . వీరుని కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వైయస్సార్ కిసాన్ భరోసా పథకం కింద ఎస్టీ రైతులకు కూడా వైయస్సార్ వైఎస్ఆర్ నాయకులు గిరిబాబు కసిరెడ్డి సత్తిబాబు తో పాటు వివిధ గ్రామాల రైతులు అందరూ మండల తాసిల్దార్ వెంకటేశ్వర్ల కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గిరిజన రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎస్డీఐ 3వ వార్షికోత్సవం



సాగర్‌నగర్‌: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ వారిచే విశాఖపట్నంలో నెలకొల్పబడిన స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ మూడేళ్ళు పూర్తిచేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని గీతం యూనివర్శిటీ సభా ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా గత వారం రోజులనుండి ప్రధాన మరియు అన్ని అనుబంధ కేంద్రాల విద్యార్థులతో నిర్వహిస్తున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల సెమీ ఫైనల్స్, ఫైనల్స్ ను వైద్య కళాశాల మైదానంలో నిర్వహించారు. విజేతలుగా నిలచిన "ఎస్డీఐ సైరాస్" జట్టుకు ట్రోఫీని సంస్థ ప్రధాన కార్య నిర్వహణ అధికారి కే.నగేష్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, గత మూడేళ్ళుగా శిక్షణా కేంద్రం సాధించిన విజయాలలో ప్రధాన పాత్ర పోషించిన శిక్షకులు, తగిన సౌకర్యాలు సమకూర్చిన భద్రతా, భోజన శాల, గ ృహ నిర్వహణ సిబ్బందికి, తమ సంస్థను అత్యున్నత స్థాయిలో ఆదరిస్తున్న పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. 70 శాతానికి మించిన ఉపాధికల్పనతో, ఎన్నో అవార్డులను అనతికాలంలోనే సాధించి దేశంలోనే ప్రముఖ సంస్థగా మెప్పుపొందడం ఆంధ్రప్రజలకు, ముఖ్యంగా విశాఖవాసులకు గర్వకారణం కాగలదని ఆయన ఆకాంక్షించారు. మూడేళ్ళ ప్రగతిని సీనియర్ మేనేజర్ మహేష్ వివరించారు. యువత ప్రదర్శించిన విభిన్న స్వంస్క ృతిక అక్రమాలతో వేదిక ఆనందోత్సాహాలలో తేలియాడింది. కార్యక్రమంలో శ్రీనివాస్, కిరణ్ కుమార్, అధ్యాపకులు, 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా అమృతరావు 99వ జయంతి వేడుకలు



గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉక్కునగరంలో ఉక్కు యాజమాన్యం అధ్వర్యంలో విశాఖ ఉక్కుఉద్యమనేత స్వర్గీయ టి.అమృతరావు 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉక్కు నగరంలోని టి.అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ కె.కె.ఘోష్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాం ఏర్పాటులో అమృతరావు పాత్ర మరువలేనిదని, ఆ మహానియుడిని కార్మికులు, ప్రజలు మరువలేరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ సీనియర్ అధికారులు, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోషియోషన్ ప్రతినిధులు, యూనియన్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ ఓబిసి అసోషియోషన్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇదేమిటని ప్రశ్నిస్తే కార్యకర్తలతో దాడులు చేయిస్తారా?

- చేతనైతే అభివృద్ధి చేసి మన్ననలను పొందండి
- టిడిపి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు పాశర్ల ప్రసాద్



సింహాచలం: 72వ వార్డు స్థానిక కళ్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిడిపి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ నాయకులు చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తే కార్యకర్తలతో రాత్రులు మా ఇంటిపైకి పంపి దాడులు చేయిస్తారా ఇటీవలే ద్రోణంరాజు శ్రీనివాస్ గారు మంత్రి గారికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఆయన పైకి ఇలాగే మనుషులను పంపారని అన్నారు.

ఇటువంటి పులివెందుల సంస్క ృతిని ప్రశాంత విశాఖ లో వాతావరణాన్ని కలుషితం చేయవద్దని ఎక్కడినుంచో వచ్చి మీరు మాపై ఇలా చేస్తే మేము ఇక్కడే పుట్టిన స్థానికులం దాడులు సహించం అన్నారు.

ఎందరో దాతలు ఇచ్చిన భూములను ఈ ప్రభుత్వం బడా బాబులకు ధారదత్తం చేస్తుందని నంబాల కుటుంబం మాధవ దార సర్వే నం 47 లో 6 ఎకరాలు 48 లో 2 ఎకరాలు మొత్తం 8 ఎకరాలు భూమిని సింహాచలం దేవస్థానం పేరిట 1952 లోనే నంబాల కుటుంబం గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసిందని, దానికి ఈ ఓ 6ఎకరాల భూమి సక్రమంగానే ఉందని అంటున్నారు మొత్తం 8 ఎకరాల్లో మిగతా రెండు ఏకరాలు ఎవరికి దారదత్తం చేశారని అన్నారు.

ఆక్రమణలో ఉన్న కాలీ స్థలలను దేవస్థానంది అని అన్ని సక్రమంగా ఉన్నవి సక్రమంగా ఉన్నవి మాకు సంబంధం లేదని రాసి ఇవ్వటం నిజమా కాదా అని ప్రశ్నించారు.

సాధారణ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న రు అన్నారు నిజాయితీ పరుడుని అని చెప్పుకొనే మంత్రి గారు సర్వే నెం 12 భైరవ వాక దగ్గర . రెవెన్యూ లో 15 ఎకరాలు తన తమ్ముడికి క్యాబ్ నెట్ లో పెట్టించి జీ ఓ తెప్పించుకుని ఇప్పుడు కీ స్కూల్ కట్టలేదని అది ప్రశ్నిస్తే దాడులు చేయిస్తారా జగన్ ప్రభుత్వం దీనిపై రివర్స్ రెండరింగ్ కి వెళ్ళ లేదేమని ప్రశ్నించారు ఇవ్వన్నీ ప్రశ్నిస్తే దాడులు చేయిస్తారా ఖబడ్ దార్ అన్నారు.

72 వార్డు అధ్యక్షుడు పి వి నరసింహం మాట్లాడుతూ ప్రశ్నిస్తే గొంతు నొక్కేస్థార పులువెందుల సంస్కృతి ప్రశాంత వాతావరణంలో తేవద్దని దాడులు చేస్తే సహించేది లేదని మీకు దమ్ముంటే మేము 72వ వార్డులో 40 కోట్లతో అభివ ృద్ధి పనులు చేశామని మీరు కనీసం ఒక సిమెంట్ పేకెట్ పని కూడా చేయలేదని దమ్ముంటే అభివ ృద్ధి చేసి చూపించి ప్రజల మనసులు గెలుచు కొండి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మేక కాసు, గోపాల్, కర్రి పైడిరాజు, పంచదర్ల శ్రీను, రాజనాల సత్యారావు, రౌతు రాంబాబు, గుసిడి బాబు. బి కనకరాజు తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి రూ. 4,988 కోట్లు

## డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి



అమరావతి: గత ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సబ్‌ప్లాన్ నిధుల అవినీతిపై నోడల్ ఏజెన్సీతో విచారణ జరిపిస్తామని డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గిరిజన సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించి.. దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శక పాలన జరుగుతుందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం కాకుండా ప్రతి పైసా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గిరిజనుల అభివృద్ధికి రూ.4,988 కోట్లతో ఉప ప్రణాళికను అమలు చేస్తున్నామని పుష్ప శ్రీవాణి పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా 30 మందికి గాయాలు



భువనగిరి : యాద్రాద్రి జిల్లా భువనగి చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 30 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. పరకాల డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి బయలు దేరిన బస్సు.. భువనగిరి బైపాస్ రోడ్డు దగ్గరకు రాగానే ఒక్కసారిగా అక్కడ ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో కొంత మంది ప్రయాణికులు కాల్వలో పడిపోయారు. తాత్కాలిక డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

# బ్రిడ్జిటల్ ఇండియా పుస్తక ఆవిష్కరణ

## సబ్కా సాథ్ సబ్కా వికాస్' సాధించడానికి టెక్నాలజీ వంతెన

## ప్రధాని నరేంద్ర మోడీ



విశాఖపట్నం : టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, రూప పురుషోత్తంమన్‌లు రచించిన బ్రిడ్జిటల్ ఇండియా పుస్తకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆవిష్కరించారు. న్యూ ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక మొదటి కాపీని టాటా గ్రూప్ ఎమిరైటస్ చైర్మన్ రతన్ టాటాకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ - టెక్నాలజీ ఒక వంతెన అని, డివైడర్ కాదని అర్థం చేసుకోవాలన్నారు.

'సబ్కా సాథ్, సబ్కా వికాస్' సాధించడానికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలు, సాధన, డిమాండ్, డెలివరీ, ప్రభుత్వం పాలనల మధ్య టెక్నాలజీ వంతెనను నిర్మిస్తుందని అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆకాంక్ష భారతదేశానికి అనుకూలత, సృజనాత్మకత, నిర్మాణాత్మక మనస్సు చాలా అవసరమన్నారు. కృత్రిమ 'మేధస్సు మరియు మానవ ఉద్దేశ్యాల మధ్య వంతెనను నిర్మించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సంస్కరణలు, రూపాంతరం, పనితీరు కోసం ప్రభుత్వ పథకాలలో సాంకేతిక పరిజ్ఞానం ఎలా కీలక పాత్ర పోషించిందో ప్రధాని వివరించారు. లక్షలాది మంది మహిళల జీవితాలను మార్చిన ఉజ్జల యోజనలో డేటా ఇంటెలిజెన్స్, డిజిటల్ మ్యాపింగ్, రియల్ టైమ్ మానిటరింగ్ వాడకం గురించి ఆయన ప్రస్తావించారు. జన ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలను శక్తివంతం చేయడంలో టెక్నాలజీ ఎలా సహాయపడిందనే దాని గురించి ఆయన వివరించారు.

# బాబూ! కించపరిచేలా మాట్లాడకండి

## మంత్రి మోపిదేవి వెంకటరమణ



అమరావతి: సభ్య సమాజం తలదించుకునేలా ప్రతిపక్షనేత చంద్రబాబు మాట్లాడుతున్నారని మార్కెటింగ్ శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ మండిపడ్డారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కించపరిచేలా మాట్లాడి.. చంద్రబాబు స్థాయిని దిగజార్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు సంస్కారహీనుడు కాబట్టే లోకేష్ మతిలేని వ్యక్తిగా మారిపోయాడని మంత్రి మోపిదేవి వ్యాఖ్యానించారు. అందుకే మంగళగిరి ప్రజలు కూడా లోకేశ్‌ను ఓడించి ఇంటికి పంపారని ఎద్దేవా చేశారు. టీడీపీ సమీక్షల్లో చంద్రబాబు అసందర్భ ప్రేలాపణలు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు.

**దళారీ వ్యవస్థను అరికట్టాం..**

రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి మోపిదేవి అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.3వేల కోట్లతో ధర స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామని తెలిపారు. శనగరైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. మార్కెట్ యార్డుల్లో దళారీ వ్యవస్థను అరికట్టామని మంత్రి మోపిదేవి చెప్పారు.

# బ్యాంకుల దేశవ్యాప్త 24 గంటల సమ్మె

ముంబై: ప్రభుత్వ బ్యాంకుల విలీనానికి నిరసనగా బ్యాంకు ఉద్యోగుల సంఘాలు దేశవ్యాప్తంగా స?మ్మెకు పిలుపునిచ్చాయి. రేపు (మంగళవారం, అక్టోబరు 22) ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్లు బ్యాంక్ యూనియన్లు పేర్కొన్నాయి. రెండు బ్యాంకు సంఘాలు అక్టోబర్ 22న 24 గంటల సమ్మెను ప్రకటించడంతో బ్యాంకింగ్ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడనుంది. దాదాపు 2 లక్షలకు పైగా ఉద్యోగులు పాల్గొనవచ్చని బ్యాంకింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవలి బ్యాంకు విలీనాలు, డిపాజిట్ రేట్లు తగ్గడం, ఉద్యోగ భద్రత సమస్యలపై నిరసనగా ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) మరియు బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) ఈ సమ్మెను చేపట్టనున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమ్మెలో పాల్గొనడం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు కూడా సమ్మెలో పాల్గొనవు.అయితే తన ఉద్యోగులలో ఎక్కువమంది పాల్గొనే యూనియన్లలో సభ్యులు కానందున సమ్మె ప్రభావం తమ కార్యకలాపాలపై తక్కువగా ఉంటుందని ఎస్బీఐ పేర్కొంది.








VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com